


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 268 | శుక్రవారం 20 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



# ఇంధన కేంద్రాలే టార్గెట్

- గల్ఫ్‌లో ముమ్మరంగా ఇరాన్ ప్రతీకార దాడులు
- క్షిపణి దాడిలో దెబ్బతిన్న ఖతార్ గ్యాస్ క్షేత్రం
- దాడులు ఆపండి : ఇరాన్‌కు 12 దేశాల విన్నపం

**టెహరాన్- సూర్య వాస్తవం**

యుద్ధోన్మాదంతో తమ నేతలు, సైనికాధికారులతో పాటు సామాన్య ప్రజానీకాన్ని... చివరికి ఏ పాపం ఎరుగని చిన్నారులను పొట్టన పెట్టుకుంటున్న అమెరికా, ఇజ్రాయిల్ దేశాలపై ప్రతీకారేచ్ఛతో ఇరాన్ రగిలిపోతోంది. ఇరాన్- ఖతార్ మధ్య విస్తరించి, ప్రపంచంలోనే అతి పెద్ద సహజ వాయువు నిక్షేపంగా కొనసాగుతున్న సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ జరిపిన దాడితో మండిపడిన ఇరాన్ గురువారం అనేక గల్ఫ్ దేశాలలోని ఇంధన కేంద్రాలపై పెద్ద ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో తీవ్ర భయాందోళనలకు గురైన ఖతార్, అజర్‌బైజాన్, బహ్రైన్, ఈజిప్ట్, జోర్డాన్, కువైట్, లెబనాన్, పాకిస్తాన్, సౌదీ అరేబియా, సిరియా, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) విదేశాంగ మంత్రులు రియాద్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. దాడులను వెంటనే నిలిపివేయాలని ఇరాన్‌ను కోరారు.

- మిగతా 2లో..

## గ్యాస్, చమురు నిల్వలు ఎంత ఉన్నాయో చెప్పండి

- ఇంధన సంస్థలకు కేంద్రం ఆదేశాలు



**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం**

దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీల వద్ద ఉన్న నిల్వలు, ఉత్పత్తి, వినియోగం, దిగుమతులకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆయా కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీలకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత ఆందోళన నెలకొంది. దేశంలో ఇంధన, గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పెట్రోల్,

- మిగతా 2లో..

## బీజేపీ మాత్రమే రక్తపాతాన్ని కోరుకునేది

- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

హోలీ పండుగ సందర్భంగా హిందువులు- ముస్లింల మధ్య జరిగిన ఘర్షణల్లో తరుణ్ బుటోలియా అనే యువకుడు మృతి చెందారు. ఈ ఘటన మార్చి 4న జరిగింది. హోలీ పండుగ సందర్భంగా నీటితో నింపిన బెలూన్‌ని తరుణ్ మేనకోడలు విసరడంతో అక్కడ గొడవ జరిగింది. హిందూ- ముస్లింల మధ్య జరిగిన ఈ ఘర్షణల్లో తరుణ్ మృతి చెందారు. ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ గురువారం స్పందించారు. బిజెపి మాత్రమే రక్తపాతాన్ని కోరుకుంటోందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ నగర్ ఘటనపై బిజెపి మత హింసను రెచ్చగొడుతుందని, ఇలాంటి రెచ్చగొట్టే చర్యలకు లొంగపోవద్దని ఢిల్లీవాసులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

- మిగతా 2లో..



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై విచారణ ఏప్రిల్ 22కు వాయిదా

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**


గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ మరోసారి వాయిదా పడింది. ఏప్రిల్ 22న ఈ పిటిషన్‌లపై విచారణ చేపడతామని గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందని 2024 ఆగస్టు 4న దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని వారు సవాల్ చేశారు. సుధీర్ఘ వాదనల తర్వాత.. కాంగ్రెస్ సర్కార్ ప్రతిపాదనలతో ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల నియామకాన్ని గతేడాది ఆగస్టు 13న సుప్రీంకోర్టు రద్దు చేసింది.

- మిగతా 2లో..

# సంస్కృతికి సాంకేతికత జోడించి అభివృద్ధి..


- పరాభవ నామ సంవత్సరంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి - సూర్య వాస్తవం**



పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం అందరికీ శుభాలను, విజయాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ కమ్యూనిటీగా నిలపాలన్నదే తన సంకల్పమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యాలుగా ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

- మిగతా 2లో..



## అసెంబ్లీ, మండలిలో విప్‌ల నియామకం

- ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు అవకాశం

**హైదరాబాద్- సూర్య వాస్తవం**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటు అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు, అటు శాసనమండలిలో ఇద్దరు ఎమ్మెల్సీలకు విప్‌లుగా అవకాశం కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. శాసన మండలిలో ప్రభుత్వ విప్‌లుగా అద్దంకి దయాకర్, డాక్టర్ వెంకట్ నర్సింగ్‌రావు

- మిగతా 2లో..

## ఉగాది నాడు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి - సూర్య వాస్తవం**

ఉగాది పర్వదినాన తమ కూటమి ప్రభుత్వం రాష్ట్ర యువతకు తీపి కబురు చెప్పిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. నిర్దేశిత సమయంలోనే ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం యువత ఆకాంక్షలను మనసుతో అర్థం చేసుకుంటోందని తెలిపారు.

- మిగతా

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో ఇద్దరికి రిమాండ్

2

## గ్యాస్, చమురు నిల్వలు

# ఎంత ఉన్నాయో చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

సహజవాయువు సరఫరా గొలుసును పర్యవేక్షించేందుకు ఒక కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కంపెనీలు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ (పీపీఏసీ)కు ఈ వివరాలు అందించాలని సూచించింది.

## బీజేపీ మాత్రమే

# రక్తపాతాన్ని కోరుకునేది

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా ఈ హింసకు ఉత్తమ్‌నగర్ ప్రజలు భారీ మూల్యం చెల్లించారు. ఈ హింస వల్ల తరుణ్ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పుడు వారి కుటుంబం మొత్తం వేధింపులను ఎదుర్కొంటోంది. వారు రక్తపాతాన్ని కోరుకోవడం లేదు. కానీ బిజెపి మాత్రమే రక్తపాతాన్ని కోరుకునేది. ద్వేషమనే పెనం మీద హింస అనే రొట్టెను కాల్చడానికి గల ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకునే నైజం బిజెపిది. దాని సహజ లక్షణమే అది అని రాహుల్ ఎక్స్ పోస్టులో బిజెపిపై తీవ్ర విమర్శలు చేశారు.
వారు (బిజెపి నేతలు) హిందూ -- ముస్లిం గొడవల్లోనే దేశం చిక్కుకొని ఉండాలని కోరుకుంటున్నారు. దేశ రక్షణ, ఇంధన భద్రత, ఆహార భద్రత, వ్యూహాత్మక సార్వభౌమాధికారాన్ని అమెరికాకు అప్పగించమని ప్రధానమంత్రిని ఎందుకు బలవంతం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకే.. దేశ రాజధానిలో పట్టపగలు అల్లర్లను సృష్టిస్తున్నారు. ఇలాంటి సమయంలో బిజెపి పాల్పడే రెచ్చగొట్టే చర్యలకు లొంగిపోవద్దని, ఐక్యత సోదరభావం, ప్రేమను వ్యాప్తి చేయాలని, కలిసికట్టుగా ఉండాలని రాహుల్ ఢిల్లీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై విచారణ

# ఏప్రిల్ 22కు వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఈ వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై విచారణ కొనసాగి స్తోంది. ఈక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ తరపున సీనియర్ అడ్వొకేట్ సంజయ్ ఎం నూలీ ఇంప్లీడ్ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశారు. అలీఖాన్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారని, ఆయనను ఎమ్మెల్సీగా కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. అయితే... ఈ పిటిషన్లపై గత నెల 3వ తేదీన విచారణ జరిపిన ధర్మాసనం.. తెలంగాణలో గవర్నర్ కోటాలో కొత్తగా చేపట్టబోయే ఎమ్మెల్సీ నియామకాలకు గత సుప్రీంకోర్టు ఆదేశాలు అడ్డంకులు కాదని స్పష్టం చేసింది. మంత్రి వర్గం సిఫారసు చేసే పేర్లపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవచ్చని తేల్చి చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసింది.

## అసెంబ్లీ, మండలిలో

# విప్‌ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

బల్మూర్ నియమితులయ్యారు. ఈ మేరకు సర్కారు జీవో నెంబరు 43ను జారీ చేసింది. అలాగే శాసనసభలో ప్రభుత్వ విప్‌లుగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను నియమించింది. ఈమేరకు ప్రభుత్వం జీవో నెంబరు 42ను విడుదల చేసింది. ఈ ఐదుగురి నియాకాలను ధృవీకరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం రాత్రి ఉత్తర్వ్యులు ఇచ్చారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని జీవో పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల తరుణంలో ప్రభుత్వ విప్‌ల నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఉగాది నాడు కూటమి ప్రభుత్వం

# తీపి కబురు చెప్పింది

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాది విడుదల చేసే నోటిఫికేషన్ల ద్వారా గ్రూప్ 1, గ్రూప్ 2, ఇంజనీరింగ్, టీచింగ్, యూనిఫాం సర్వీసెస్ వంటి పలు విభాగాల్లో పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు. గత 20 నెలల కాలంలో తమ ప్రభుత్వం 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని పవన్ గుర్తుచేశారు. ఇటీవల ఉపాధ్యాయ, కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించినప్పుడు యువత కళ్లలో ఆనందం చూశామని తెలిపారు. తాజా ప్రకటన నేపథ్యంలో ఉద్యోగార్థులు ఏమాత్రం సమయం వృథా చేయకుండా ప్రిపరేషన్‌లో నిమగ్నం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో

# ఇద్దరికి రిమాండ్

**మదనపల్లె అర్బన్ - సూర్య వాస్తవం**

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ దస్త్రాల దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకుడు బల్లాపురం ముని తుకారాం, ప్రధాన అనుచరుడు వంకరెడ్డి మాధవరెడ్డిలను సిఐడి అధికారులు బుధవారం అరెస్టు చేసి గురువారం చిత్తూరు కోర్టులో హాజరుపరిచారు. ఇద్దరికి న్యాయమూర్తి 14 రోజుల డిమాండ్ విధించగా పోలీసులు జైలుకు తరలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2024 జులై 21వ తేదీ రాత్రి జరిగిన రెవెన్యూ దస్త్రాల దహనం ఘటనలో వీరిద్దరూ ప్రధాన కుట్రదారులుగా సిఐడి అభియోగాలు మోపింది. ఈ ఘటనపై తిరుపతి జిల్లా అలిపిరి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అదే సమయంలో మునితుకారాం అమెరికాకు పరారైనట్లు గుర్తించిన సిఐడి లుకౌట్ సర్క్యులర్ జారీచేసింది. సుమారు 20 నెలల తర్వాత జిల్లాకు మునితుకారాం, మాధవరెడ్డి కలిసి వచ్చారు. అరెస్టు చేసిన వీరిని తిరుపతిలోని సిఐడి ప్రాంతీయ కార్యాలయానికి తరలించి ఆరేడు గంటలు విచారించారు. గురువారం చిత్తూరు కోర్టులో ప్రవేశ పెట్టగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

# ఇంధన కేంద్రాలే టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

హర్మూజ్ జలసంధిలో చమురు నౌకల ప్రయాణానికి వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను కూడా వారు ఖండించారు. లెబనాన్ భద్రత, సుస్థిరత, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు తెలిపారు.

**దాడులతో గల్ఫ్ విలవిల**

గల్ఫ్ దేశాలలోని చమురు స్థావరాలు, అమెరికా ఆస్తులపై ఇరాన్ గురువారం దాడులు జరిపింది. ఖతార్‌లోని రాస్ లాఫన్ గ్యాస్ క్షేత్రంపై ఇరాన్ క్షిపణులు దాడి చేసి తీవ్రంగా నష్టపరిచాయి. ఆ ప్రదేశంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ప్రపంచంలోని అతి పెద్ద చమురు క్షేత్రాలలో ఇది ఒకటి. ప్రపంచ ఇంధన మార్కెట్లకు సహజ వాయువును సరఫరా చేయడంలో ఖతార్ కీలక పాత్ర పోషిస్తోంది. రాస్ లాఫన్‌పై జరిగిన దాడిని ఖతార్ ఎమిర్ షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ థానీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ తీవ్రంగా ఖండించారు. దాడి నేపథ్యంలో తమ దేశంలోని ఇరాన్ రాయబార కార్యాలయ సిబ్బందిలో కొందరిని ఖతార్ బహిష్కరించింది.
కాగా యూఏఈలోని హబ్‌షాన్ గ్యాస్ కేంద్రం పైన, బాబ్ క్షేత్రం పైన కూడా ఇరాన్ దాడి చేసింది. రియాద్, తూర్పు రాష్ట్రాలపై ఇరాన్ ప్రయోగించిన ఎనిమిది డ్రోన్లను అడ్డుకొని ధ్వంసం చేశామని సౌదీ అరేబియా తెలిపింది. దక్షిణ ఇరాక్‌లో కువైట్ సరిహద్దున ఉన్న ఉమ్ ఖసర్ నౌకా స్థావరంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటుపై డ్రోన్ పడడడంతో మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. బాగ్దాద్ విమానాశ్రయం సమీపంలోని అమెరికా శిబిరంపై రెండు డ్రోన్లు పడ్డాయి. పారామిలిటరీ పాప్యులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్‌కు చెందిన ప్రదేశాలపై అనేక దాడులు జరిగాయని తెలుస్తోంది. అటు ఇజ్రాయిల్‌పై కూడా క్షిపణులతో ఇరాన్ దాడులు చేసింది. దీంతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సైరన్లు మోగించారు.

**ఆ దాడి గురించి మాకేమీ తెలియదు : అమెరికా సౌత్ పార్స్‌పై ఇక ఇజ్రాయిల్ దాడి చేయదు : ట్రంప్**

ఇరాన్‌కు చెందిన అత్యంత విలువైన సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడులు చేయబోదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భరోసా ఇచ్చారు. 'అమాయకురాలైన ఖతార్‌పై దాడి చేయాలని ఇరాన్ తెలివితక్కువతనంతో నిర్ణయించుకుంటే తప్ప సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడి చేయబోదు' అని ఆయన అన్నారు. ఇరాన్‌లోని సౌత్ పార్స్ ఆఫ్‌షోర్ ఎల్ఎన్‌జీ క్షేత్రంపై ఇజ్రాయిల్ జరిపిన దాడి, దానికి ప్రతిగా ఖతార్‌లోని అతి పెద్ద గ్యాస్ క్షేత్రం పైన, పర్షియన్ గల్ఫ్‌లోని ఇంధన స్థావరాల పైన ఇరాన్ చేస్తున్న దాడుల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్య చేశారు.
ఒకవేళ ఖతార్‌పై ఇరాన్ దాడి చేస్తే ఇజ్రాయిల్ సాయం కానీ, అనుమతి కానీ తీసుకోకుండా సౌత్ పార్స్ క్షేత్రాన్ని పేల్చివేస్తామని, ఇరాన్ గతంలో ఎన్నడూ చూడని విధంగా తమ బలాన్ని, శక్తిని ప్రదర్శిస్తామని హెచ్చరించారు. కాగా ఆగ్రహంతోనే ఇజ్రాయిల్ ఈ దాడి చేసి హింసాత్మకంగా ప్రవర్తించిందని, దాడి గురించి తమకేమీ తెలియదని అమెరికా కమాండర్-ఇన్-చీఫ్ చెప్పారు. అలా జరుగుతుందని ఖతార్‌కు కూడా తెలియదని అన్నారు. వాస్తవాన్ని తెలుసుకోకుండా ఖతార్ ఎల్ఎన్‌జీ గ్యాస్ క్షేత్రంలోని ఓ భాగంపై ఇరాన్ దాడి చేసిందని విమర్శించారు.

**సౌత్ పార్స్‌పై ఇజ్రాయిల్ దాడితో... భారత్‌కు గడ్డు కాలమే**

యుద్ధంలో ఇంధన ఆస్తులపై జరుగుతున్న దాడులు భారత్‌కు ఇబ్బంది కలిగిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్, ఇజ్రాయిల్...ఈ రెండు దేశాలూ తొలిసారిగా శిలాజ ఇంధన ఉత్పత్తికి సంబంధించిన కేంద్రాలు, క్షేత్రాలపై దాడులు చేస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో ఇప్పుడు ఇంధనం ఓ ఆయుధంగా మారిపోయింది. ఈ నెల 17వ తేదీ వరకూ అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ ఇంధన ఉత్పత్తి కేంద్రాల వైపు చూడలేదు. ఖర్గ్ దీవిపై ట్రంప్ దాడి చేసినప్పటికీ కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నారు. కానీ బుధవారం సీను మారిపోయింది. ఖతార్‌తో ఇరాన్ పంచుకుంటున్న సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ దాడి చేయడం, దానికి ప్రతిగా సౌదీ అరేబియాలోని సమ్రెఫ్ రిఫైనరీ పైన, అలాగే ఖతార్, యూఏఈలలోని గ్యాస్ క్షేత్రాల పైన ఇరాన్ దాడులు చేయడంతో యుద్ధం ప్రమాదకరమైన మలుపు తిరిగింది. భారత్ సహా అనేక దేశాలకు ఎల్ఎన్‌జీని సరఫరా చేయడంలో సౌత్ పార్స్ క్షేత్రం వెన్నెముకగా ఉంది. ఇజ్రాయిల్ దాడి కారణంగా చమురు, గ్యాస్ ధరలు తక్షణమే పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. హర్మూజ్ జలసంధిలో ముడి చమురు సరఫరాలను ఇరాన్ ఇప్ప టికే అడ్డుకుంటోంది. ఇప్పుడు ఉత్పత్తి కేంద్రాలపై జరు గుతున్న దాడుల కారణంగా చమురు సరఫరాలకు మరింత ఆటంకం ఏర్పడి చాలా కాలం వరకూ ప్రభావం పడవచ్చు. ఎందుకంటే సౌత్ పార్స్ క్షేత్రంలో నిల్వ ఉండే గ్యాస్ ప్రపంచ అవసరాలను 12-13 సంవత్సరాల పాటు తీరుస్తుంది. ఈ గ్యాస్ క్షేత్రం కేవలం ఇరాన్‌కు చెందినది మాత్రమే కాదు. దానిని ఖతార్‌తో ఇరాన్ పంచుకుంటోంది. అమెరికా మిత్ర దేశంగా ఉన్న ఖతార్ ప్రపంచంలోనే ఎల్ఎన్‌జీని అత్యధికంగా ఉత్పత్తి చేస్తోంది.

**మధ్యప్రాచ్యానికి వేలాది అమెరికా దళాలు**

మధ్యప్రాచ్యంలో సైనిక బలగాలను మరింతగా పెంచే ఉద్దేశంతో అక్కడికి వేలాది దళాలను పంపాలని ట్రంప్ ప్రభుత్వం యోచిస్తోంది. యుద్ధంలో తదుపరి చర్యలకు అమెరికా సైన్యం సమాయత్తమవుతోందని అధికారులు తెలిపారు. హర్మూజ్ జలసంధిలో చమురు నౌకలు సురక్షితంగా ప్రయాణించేలా చూడాలని ట్రంప్ భావిస్తున్నారు. అందుకోసం వైమానిక, నౌకా దళాల అవసరం ఎంతగానో ఉండడంతో వాటి మోహరింపునకు ఆయన సిద్ధపడుతున్నారు. ఇరాన్‌లోని ఖర్గ్ దీవిపై భూతల దాడులు చేసే అవకాశంపై ట్రంప్ ఇప్పటికే అధికారులతో చర్చించారు. ఇరాన్ చమురు ఎగుమతులలో 90 శాతం వరకూ ఈ దీవి ద్వారానే జరుగుతున్నాయి. అయితే భూతల దాడులు చేయడం ప్రమాదంతో కూడుకున్న వ్యవహారమని, ఆ దీవిపైక్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ తేలికగా దాడులు చేస్తుందని కొందరు అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. పరిమిత స్థాయిలోనైనా భూతలు దాడులు జరపడం నష్టాన్నే కలిగిస్తుందని వారు స్పష్టం చేశారు. అదీకాక యుద్ధానికి అమెరికన్ల మద్దతు చాలా తక్కువగా ఉంది. కాగా ఇరాన్‌లో ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకునే విషయంపై కూడా ట్రంప్ సమాలోచనలు జరుపుతున్నారు. ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు సాయుధ దళాలను దింపకపోవచ్చునని పలువురు అధికారులు అభిప్రాయపడ్డారు. ఇరాన్ యురేనియ నిల్వలను స్వాధీనం చేసుకోవడం సంక్లిష్టతతో కూడిన వ్యవహారమని, అంతేకాక అది ప్రమాదంతో కూడుకున్నదని నిపుణులు హెచ్చరించారు.

**డిఫెన్స్‌లో ట్రంప్**

ప్రపంచంలో అతి పెద్ద సహజ వాయువు క్షేత్రంగా ఉన్న ఇరాన్‌లోని సౌత్ పార్స్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడి అమెరికా అధినేతను డిఫెన్స్‌లో పడేసింది. దాడి గురించి తనకేమీ తెలియదంటూ ఆయన సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపేసిన ఈ దాడి కారణంగా సరఫరాలకు తీవ్ర ఆటంకం కలిగి చమురు, గ్యాస్, నిత్యావసరాల ధరలు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. సౌత్ పార్స్ క్షేత్రానికి ఓ వైపు ఇరాన్, మరో వైపు ఖతార్ ఉన్నాయి. ఇరాన్‌లోని బుషెహర్ రాష్ట్రంలో ఉన్న ఈ క్షేత్రంలో అపార గ్యాస్ నిల్వలు ఉన్నాయి. ఇరాన్ సహజ వాయువు అవసరాలను 70 శాతం వరకూ ఈ క్షేత్రమే తీరుస్తోంది. అంతేకాదు... ప్రపంచ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) డిమాండ్‌లో 20 శాతాన్ని సమకూరుస్తోంది. ఈ క్షేత్రంలో 1,800 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ నిల్వ ఉంది. ప్రపంచ గ్యాస్ నిల్వలో ఇది ఎనిమిది శాతం. ఖతార్ నుంచి యూరప్, ఆసియా దేశాలకు జరిగే ఎల్ఎన్‌జీ ఎగుమతులపై కూడా ఈ దాడి ప్రభావం చూపుతుంది.

**యుద్ధానికి 200 బిలియన్ డాలర్లు ఇవ్వండి : అమెరికా కాంగ్రెస్‌ను కోరిన పెంటగాన్**

ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధం కోసం 200 బిలియన్ డాలర్లు అందజేయాలని అమెరికా ప్రతినిధి సభను పెంటగాన్ కోరింది. దీనికి కాంగ్రెస్ అనుమతి లభిస్తే ఆయుధ ఉత్పత్తి పెరిగి యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమై దాదాపు మూడు వారాలు గడిచాయి. ఇప్పటి వరకూ అమెరికా దళాలు 7,800కు పైగా లక్ష్యాలపై దాడులు చేశాయి. ఎనిమిది వేలకు పైగా యుద్ధ విమానాలను రంగంలోకి దించాయి. 120 ఇరాన్ నౌకలను ధ్వంసం చేయడమో లేదా నష్టపరచడమో జరిగింది.
యుద్ధం ప్రారంభమైన తర్వాత మొదటి వారంలోనే అమెరికా 11 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసింది. ఇప్పుడు రక్షణ శాఖ కోరుతున్న 200 బిలియన్ డాలర్లను కూడా దానికి కలుపుకుంటే యుద్ధంపై అమెరికా చేసే వ్యయం ఇరాన్ వార్షిక జీడీపీలో సగానికి కంటే ఎక్కువే అవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరానికి అమెరికా ప్రతినిధి సభ ఇప్పటికే 838.5 బిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్‌ను ఆమోదించింది. ఇరాన్‌పై ట్రంప్ సాగిస్తున్న పోరును మెజారిటీ అమెరికన్లు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రతినిధి సభలో రక్షణ శాఖ ప్రతిపాదనపై వాడి వేడి చర్చ జరిగే అవకాశం ఉన్నదని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తెలిపింది.

**ప్రపంచ నేతలకు మోడీ ఫోన్**

ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఒమర్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌లతో టెలిఫోన్‌లో సంభాషించారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న తాజా పరిస్థితులపై ఆరా తీశారు.

# సంస్కృతికి సాంకేతికత జోడించి అభివృద్ధి..

(మొదటిపేజీ తరువాయి)

**సంస్కృతి, సాంప్రదాయాలకు సైన్స్ జోడింపు**

ఉగాది పండుగ తెలుగువారి తొలి పండుగ అని, మన సంస్కృతి, సాంప్రదాయాల్లో సైన్స్ ఇమిడి ఉందని చంద్రబాబు వివరించారు. ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మన ఆచారాలైన వాస్తు, యోగా, ధ్యానం వెనుక శాస్త్రీయత దాగి ఉందని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇవి దోహదపడతాయని అన్నారు. గతంలో తాను ఐటీ ప్రాముఖ్యతను గుర్తించి ప్రోత్సహించడం వల్లే నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. తాను కూడా సెల్ ఫోన్ ద్వారానే పాలన సాగిస్తూ, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటున్నానని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం**

2024కు ముందు రాష్ట్రంలో పండుగలు కూడా జరుపుకోలేని భయానక వాతావరణం ఉండేదని, అరాచకాలు, విధ్వంసంతో ప్రజలు విసిగిపోయారని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలనే సంకల్పంతో జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలలుగా సమ్మిళిత సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మందిని పైకి తీసుకురావడానికి, ఆర్థికంగా నిలదొక్కుకున్న 10 శాతం మంది చేయూతనివ్వాలని కోరుతూ 'మార్గదర్శి బంగారు కుటుంబం' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.

**ఉగాది కానుకగా ఉద్యోగాల జాతర**

యువత భవిష్యత్తుకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉగాది పండుగ సందర్భంగా చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఇకపై ప్రతి ఏటా ఉగాది రోజున ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 10,060 ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేశారు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, హోంశాఖ, ఉన్నత విద్య, ఇంజనీరింగ్ వంటి పలు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మే 15 నుంచి అక్టోబర్ 15 మధ్య ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చాక తొలి సంతకంతో మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టులతో సహా మొత్తం 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేటు రంగంలో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించామని గుర్తుచేశారు.

**పోలవరం, అమరావతిపై స్పష్టమైన హామీ**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగానే పోలవరం, అమరావతి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభ మయ్యేలోగా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. దీనికి అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని, త్వరలోనే మిగిలిన నిధులను కూడా సమకూర్చుకుని పనులు వేగవంతం చేస్తామన్నారు. అమరావతి దేవతల రాజధాని మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ప్రజల రాజధాని అని పేర్కొన్నారు. అమరావతిని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసి, సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని వెంకటేశ్వర స్వామిని ప్రతిరోజూ ప్రార్థిస్తానని తెలిపారు.

**కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కొత్త విధానాలు**

మారుతున్న కాలంతో పాటు కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులపై చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు తలెత్తుతాయని, అందుకే జనాభా నిర్వహణపై కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలిపారు. "ఒకరు వద్దు, ఇద్దరు ముద్దు, ముగ్గురుంటే ఇంకా మంచిది" అనే నినాదంతో ముందుకెళ్తామన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఆర్థిక సహాయం అందించి కుటుంబాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. పెద్ద కుటుంబాలు సుఖసంతోషాలకు నిలయాలని, విడిపోవడం కంటే కలిసి ఉండటానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.

**2047 నాటికి తెలుగుజాతి నంబర్ వన్**

ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మనపై ప్రభావం చూపుతాయని, ఇలాంటి సమయంలో మనం తప్పులు చేయకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని చంద్రబాబు హితవు పలికారు. పరాభవ నామ సంవత్సరం తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పే సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు. 2047 నాటికి భారతదేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి తెలుగువారు ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలవాలనే సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. సంపదతో పాటు విలువలను కాపాడుకుంటూ,

## కేరళలో కమలం కొత్త మంత్రం...

**తిరువనంతపురం - సూర్య వాస్తవం**



కేరళ రాజకీయాల్లో పాగా వేయాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ, అక్కడ కేవలం హిందూత్వ కార్డుతోనే విజయం సాధించలేమని గుర్తించి, వ్యూహాత్మకంగా తన రూటు మార్చింది. ముఖ్యంగా రాష్ట్ర జనాభాలో దాదాపు 18-20 శాతం ఉన్న క్రైస్తవులను ఆకర్షించేందుకు క్రిస్టియన్ మంత్రం పఠిస్తోంది.కేరళలో దశాబ్దాలుగా క్రైస్తవ సమాజం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కి వెన్నెముకగా ఉంటూ వస్తోంది. అయితే, ఇటీవల ముస్లిం లీగ్ ప్రభావం యూడీఎఫ్‌లో పెరిగిందన్న భావన క్రైస్తవుల్లో ఒక రకమైన అసంతృప్తిని కలిగిస్తోంది. దీనిని ఆసరాగా చేసుకున్న బీజేపీ, క్రైస్తవులను తనవైపు తిప్పుకోవడం ద్వారా కాంగ్రెస్ పునాదులను దెబ్బతీయాలని చూస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిసూర్ విజయం, సురేష్ గోపీకి లభించిన క్రైస్తవ ఓట్ల మద్దతు ఈ వ్యూహం ఫలిస్తున్నదని బీజేపీ బలంగా నమ్ముతోంది.

ముస్లిం జనాభా పెరుగుదల, వక్ఫ్ బోర్డు భూముల వివాదాస లవ్ జిహాద్ వంటి అంశాలపై క్రైస్తవ సమాజంలో ఉన్న ఆందోళనలను బీజేపీ తన రాజకీయాస్త్రాలుగా మలుచుకుంటోంది. ఈ అంశాల్లో క్రైస్తవ మత పెద్దలకు మద్దతుగా నిలవడం ద్వారా, మీ ప్రయోజనాలను రక్షించేది మేమే అనే సంకేతాన్ని పంపిస్తోంది. ముఖ్యంగా కాథలిక్ చర్చిలోని కొన్ని వర్గాలు ఇటీవల బీజేపీ వైపు మొగ్గు చూపడం, ఆర్ఎస్ఎస్ ( నేతలు బిషప్‌లతో చర్చలు జరపడం ఈ సామాజిక ఇంజనీరింగ్ లో భాగమే.కేవలం మాటలకే పరిమితం కాకుండా, పార్టీ పదవుల్లో క్రైస్తవులకు పెద్దపీట వేస్తోంది. కేంద్ర మంత్రిగా జార్జ్ కురియన్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనీల్ ఆంటోనీ వంటి వారిని ముందుంచడం ద్వారా క్రైస్తవ వ్యతిరేక పార్టీ అనే ముద్రను చెరిపేసే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అధిక సంఖ్యలో క్రైస్తవ అభ్యర్థులను నిలబెట్టాలని, తద్వారా ప్లాన్-బి కింద క్రైస్తవ ప్రాబల్యం ఉన్న మధ్య కేరళలో పట్టు సాధించాలని ప్లాన్ చేస్తోంది. ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ స్నేహయాత్ర వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టింది. క్రిస్మస్, ఈస్టర్ పండగల సమయంలో బీజేపీ నేతలు చర్చిలను సందర్శించడం, క్రైస్తవ కుటుంబాల ఇళ్లకు వెళ్లి మోదీ ప్రభుత్వ పథకాలను వివరించడం వంటివి క్షేత్రస్థాయిలో మార్పు తెస్తున్నాయి. ముఖ్యంగా రబ్బర్ ధరల పతనం వంటి ఆర్థిక అంశాలపై కేంద్రాన్ని ఒప్పించి రైతులకు మేలు చేస్తామని హామీ ఇవ్వడం ద్వారా కేరళలోని సిరో-మలబార్ చర్చి మద్దతును పొందేందుకు గట్టి ప్రయత్నం చేస్తోంది.బీజేపీ వ్యూహానికి కొన్ని ప్రధాన సవాళ్లు కూడా ఉన్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో క్రైస్తవ మిషనరీలపై జరుగుతున్న దాడులు, మణిపూర్ హింసాకాండ వంటి అంశాలను ఇతర పార్టీలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. ఒకవైపు ఇక్కడ స్నేహం నటిస్తూనే, మరోవైపు దాడులు చేస్తున్నారు అనే ప్రచారాన్ని క్రైస్తవ సమాజంలోకి తీసుకెళ్లడంలో ప్రతిపక్షాలు కొంతవరకు సఫలమవుతున్నాయి. ప్రస్తుతానికి బీజేపీ వేస్తున్న అడుగులు కేరళలో త్రిముఖ పోటీకి తెరలేపాయి. క్రైస్తవ ఓట్లలో కనీసం 10-15 శాతం చీల్చగలిగినా, అది ఎల్డీఎఫ్ లేదా యూడీఎఫ్ ల గెలుపోటములను శాసిస్తుంది. . బహిరంగంగా బీజేపీని వ్యతిరేకించే క్రైస్తవులు కూడా రాస్యంగా ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికలే బీజేపీ ఈ క్రైస్తవ మంత్రం ఎంతవరకు పారిందో తేల్చే అసలైన తీర్పు కానున్నాయి.

## కథ కంచికేనా...




**కడప - సూర్య వాస్తవం**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి మృతిపై ఇక ఏమీ తేలదు. ఇప్పటికి ఇంతే. సీబీఐ కూడా సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కేసులో కొత్తగా ఎవరినీ నిందితులుగా చేర్చలేదని, అదనపు ఆధారాలు లభించలేదని నివేదించింది. ట్రయల్ కోర్టులో విచారణను వేగవంతం చేసి, నాలుగు వారాల్లోగా ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ కేసులో నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలన్న విజ్ఞప్తులను సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంతో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత పోరాటం కూడా ముగిసినట్లేనని అనుకోవాలి. ఇక వైఎస్ వివేకా మృతిలో మిస్టరీ వీడే అవకాశం లేనట్లే కనిపిస్తుంది.వైఎస్ వివేకా మృతి జరిగి ఏడేళ్లు కావస్తుంది. గొడ్డలి పోట్లు ఉండటంతో అది హత్య అని అందరూ ఆరోపించు. ఇప్పటి వరకూ హత్యకు గల కారణాలు.. హత్య చేసిందెవరన్నది తేల్చలేకపోయారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత ఒంటరి పోరాటం చేస్తున్నారు. న్యాయ పోరాటం చేశారు. ఈ హత్య కేసులో ఆధారాలు లభించలేదా? లేక ఆధారాలను చెరిపేయడంతో విచారణలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదా? మరి దేశంలోనే అనేక క్లిష్టమైన కేసులను పరిష్కరించిన సీబీఐ వల్ల కూడా కాలేదంటే అసలు ఈ కేసు ఇక మూలనపడినట్లేనని అంటున్నారకు.ఒక హత్య జరిగితే వెంటనే దానికి గల కారణాలను, నిందితులను ఎక్కడున్నా పట్టుకునే దర్యాప్తు అధికారులు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మిస్టరీని ఎందుకు ఛేదించలేకపోతున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి ఆధారాలున్నా.. ఏమాత్రం సాంకేతికమైన చిన్నపాటి క్లూలు లభించినా దర్యాప్తు అధికారులు వదిలిపెట్టే ప్రశ్న ఉండదు. కానీ వివేకానంద రెడ్డి హత్య జరిగింది 2019లో. ఏడేళ్లుగా కుమార్తె డాక్టర్ సునీత పోరాటం చేస్తుంది. కానీ హత్యకు గల కారణాలు కూడా తెలియరాలేదు. ఇక నిందితులెవరూ లేరని, అందుకు తగిన ఆధారాలు లభించలేదని చెప్పడంతో వైఎస్ వివేకా హత్య కేసు ఎప్పటికీ మిస్టరీగానే మిగిలిపోనుంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనేక విషయాలు గత ఏడేళ్లుగా ప్రచారంలో ఉన్నాయి. వాటిలో నిజానిజాలు ఆ భగవంతుడికే తెలియాలి. వాటికి ఎటువంటి ఆధారాలు లేవు. ఒక మాజీ ముఖ్యమంత్రి సోదరుడు, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయి ఇన్నేళ్లవుతున్నా కనీసం హత్యకు గల కారణాలను బయట ప్రపంచానికి తెలియకపోవడంతో ఇక దర్యాప్తు సంస్థలపై కూడా ప్రజలకు దురభిప్రాయం ఏర్పడే అవకాశముంది. అలాంటి వారికే న్యాయం జరగనప్పుడు ఇక సామాన్యులకు సరైన న్యాయం ఎందుకు జరుగుతుందన్న ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. వైఎస్ వివేకానందరెడ్డిది సహజ మరణం కాదు.కానీ అందుకు గల కారణాలు ఇప్పటి వరకూ తెలియకపోవడం మాత్రం

# మంత్రివర్గ మార్పులపై ఊహాగానాలు

**విజయవాడ - సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గంలో భారీ మార్పులు చేపట్టబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గ పునర్వ్య వస్థీకరణ చేపట్టేందుకు సీఎం సిద్ధమవుతున్నారని మీడియాలో కథనాలు వస్తున్నాయిముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో ఎప్పుడూ క్రమశిక్షణకు, పనితీరుకు పెద్దపీట వేస్తారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరుపై ఆయన సంతృప్తిగా లేరని, అందుకే సుమారు 10 మంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారిని పదవుల నుండి తొలగించడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.ప్రధానంగా మంత్రుల పనితీరును అంచనా వేయడానికి కొన్ని కీలక ప్రమాణాలను ఆయన ప్రాతిపదికగా తీసుకుంటున్నట్టు సమాచారం. ముఖ్యంగా మంత్రులు తమకు కేటాయించిన శాఖలపై ఎంతవరకు అవగాహన కలిగి ఉన్నారు? ఎంతమేరకు పట్టు సాధించారని బేరీజు వేస్తున్నారు. పాలనలో అధికారులతో కలిసి ఎలా పని చేస్తున్నారు? ఎన్ని సమీక్షా సమావేశాలు నిర్వహించారు? కేంద్ర ప్రభుత్వం నుండి తమ శాఖలకు రావాల్సిన నిధులను రాబట్టడంలో ఎంతవరకు సఫలీకృతులయ్యారు? ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ఏ మేరకు కృషి చేశారు? ఎన్ని ప్రెస్ మీట్స్ నిర్వహించి ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టారు? .. లాంటి అంశాలపై చంద్రబాబు నివేదికలు రెడీ చేస్తున్నట్టు తెలుస్తోంది.ప్రతి మంత్రికీ ఒక ప్రోగ్రెస్ కార్డ్ సిద్ధమవుతోంది. ఈ నివేదికలు కేవలం పైపైన పరిశీలనతో కాకుండా, ప్రతి నిమిషం వారి పనితీరును పర్యవేక్షించి తయారు చేస్తున్నారు. ఈ రిపోర్టుల ఆధారంగానే ఎవరిని కొనసాగించాలి, ఎవరికి ఉద్వాసన పలకాలి అనే విషయంలో సీఎం ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ పరిణామం ప్రస్తుతం ఉన్న చాలా మంది మంత్రులకు నిద్ర లేకుండా చేస్తోంది.ఈసారి జరగబోయే మార్పుల్లో లోకేశ్ టీంకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తు రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని, లోకేష్‌కు అండగా ఉండేలా ఉత్సాహవంతులైన నాయకులకు, యువకులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుస్తోంది. లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే వారికే ఈసారి పెద్దపీట వేయబోతున్నట్లు సమాచారం.ఈ మంత్రివర్గ మార్పులు కేవలం పరిపాలన కోసమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఉంటాయని తెలుస్తోంది. ఎన్నికలకు వెళ్లే ముందు బలమైన టీమ్‌ను సిద్ధం చేసుకోవడం చంద్రబాబు వ్యూహం. ఉగాది పండుగ నాటికి లేదా మరో రెండు మూడు నెలల్లో ఈ మార్పులు ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా కేబినెట్ మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలాంటి సమాచారమూ లేదు.మొత్తానికి ఏపీ క్యాబినెట్‌లో రాబోయే మార్పులు కేవలం వ్యక్తుల మార్పు మాత్రమే కాదు, అది ప్రభుత్వ పనితీరులో వేగాన్ని పెంచే ప్రయత్నం. 10 మంది మంత్రుల శాఖల మార్పు, కొత్త రక్తానికి అవకాశం ఇవ్వడం ద్వారా పాలనలో కొత్త ఉత్తేజాన్ని తీసుకురావాలని చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రోగ్రెస్ కార్డ్ రాజకీయాల్లో ఎవరి భవిష్యత్తును నిర్ణయిస్తుందో వేచి చూడాలి.

**కూటమి పార్టీలు..**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నారా లోకేశ్ ఒకరకంగా భావి నేతగా అవతరిస్తున్నారు. నారా లోకేశ్ విభిన్నశైలిని చూసిన వారికి ఎవరికైనా త్వరలోనే ఆయన కీలక పదవి అధిష్టించే అవకాశముందని అంచనా వేస్తారు. ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను ఎత్తి చూపేవారిని శత్రువులుగా చూస్తారు. వైసీపీ హయంలో సమస్యలు చెప్పిన వాళ్లపై టీడీపీ ముద్ర వేసి వేధించారు. కానీ ఇక్కడ నారా లోకేశ్ మార్పు చూపిస్తున్నారు. సమస్యలను ప్రస్తావించడాన్ని ఓ సానుకూల విషయంగా చూసి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కోణంలో మన్యంలో సమస్యలపై జాతీయ మీడియా కథనాలు వచ్చినా.. గుంటూరులో డ్రైనేజీ సమస్య గురించి ఓ మహిళ చెప్పినా? ఉద్దేశపూర్వకంగా చేశారని తెలిసినా.. మధ్యాహ్నభోజనం అంశంపై ఓ వీడియోలో విద్యార్థుల ఆగ్రహం గురించి తెలిసినా..ఆయన చాలా పాజిటివ్ గా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్నవారు తమ వైఫల్యాలను ఎత్తిచూపే వారిని రాజకీయ శత్రువులుగా చూస్తుంటారు. కానీ, ఇప్పుడు నారా లోకేశ్ దానికి విభిన్నంగా వ్యవహరిస్తున్నారు.. తన వద్దకు వచ్చే విమర్శలను, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఆయన ఒక ఫీడ్‌బ్యాక్ గా స్వీకరిస్తున్నారు. సమస్య ఎక్కడ ఉన్నా, అది ఎవరు చెప్పినా.. దాని వెనుక రాజకీయం ఉందా లేదా అని చూడకుండా పరిష్కారం వైపే అడుగులు వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా దేవునిచెరువు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగ్గా లేదని విద్యార్థులు ఆహారాన్ని చెత్తబుట్టలో పోస్తున్న వీడియో వైరల్ అయ్యింది. దీనిపై లోకేష్ స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగితే సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తారు, కానీ లోకేష్ మాత్రం నిస్సంకోచంగా క్షమాపణలు చెప్పారు. బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందకపోవడం నా బాధ్యతారాహిత్యం అని పేర్కొంటూ వెంటనే సంబంధిత ఏజెన్సీని తొలగించి, హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయించారు.

ఒక మంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా క్షమాపణలు చెప్పడం రాజకీయాల్లో అత్యంత అరుదైన విషయమని కూడా అంటున్నారునారా లోకేశ్ విషయంలో కూటమి పార్టీల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఏమీ లేనట్లే కనిపిస్తుంది. నారా లోకేశ్ పర్యవేక్షణలోనే పరిపాలన నడుస్తుందని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలకు తెలుసు. కానీ వారు మాత్రం దానిని పాజిటివ్ గానే తీసుకుంటున్నారు. ఎటూ జరిగేది అదేనని, అత్యధిక స్థానాలతో అధికారంలో ఉన్న టీడీపీలో నాయకత్వ బాధ్యతను ఎవరికి అప్పగించాలన్నది ఆ పార్టీ నేతల ఇష్టమన్న అభిప్రాయానికి వచ్చేసినట్లు కనిపిస్తుంది. లోకేష్ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథాను జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కూడా మనస్ఫూర్తిగా ప్రశంసించారు. విమర్శలను స్వీకరించి, వాటిని పరిష్కరించే విషయంలో నారా లోకేశ్ చూపిస్తున్న పరిణతి రాజకీయాల్లో గొప్ప మార్పుకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద నారా లోకేశ్ అందరి అనుమతితోనే త్వరలోనే కీలక పదవి చేపట్టే అవకాశాలను ఎవరూ కొట్టి పారేయలేకపోతున్నారు.

# కూటమిని చీల్చేదెలా...

**నెల్లూరు- సూర్య వాస్తవం**



కూటమిని విడగొడితేనే రాజకీయ భవిష్యత్ అని వైసీపీ గట్టి నమ్మకంతో ఉంది. పై స్థాయిలో అగ్రనేతలు అందరూ కలసిమెలిసి ఉంటున్నారు. వారి మధ్య విభేదాలు సృష్టించడం సాధ్యం కావడం లేదు. అందుకే వైసీపీ.. జనసేన బలాన్ని తగ్గించేందుకు అంబటి రాంబాబు అస్త్రాన్ని ప్రయోగించింది. కాపు వర్గంలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అదే సమయంలో వైసీపీకి అది పెద్ద అవకాశంగా స్థానిక ఎన్నికలు రాబోతున్నాయి. ఆ స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల క్యాడర్ ఏకాభిప్రాయంతో ఉండటం కష్టం. అందరూ అవకాశాలు కోరుకుంటారు. ఇలాంటి సమయంలో ఆ పార్టీల మధ్య చిచ్చు పెట్టడానికి కావాల్సినంత సరుకు లభిస్తుంది. దీన్ని ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపైనే వైసీపీ ప్రణాళికలు ఉండే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం గెలుపు ఓటముల కన్నా వ్యూహ ప్రతివ్యూహాల పర్వం నడుస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , తిరిగి పుంజుకోవడానికి ఒకే ఒక మార్గం ఉందని బలంగా నమ్ముతోంది. అది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని విడగొట్టడం. అగ్రస్థాయి నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ మధ్య సయోధ్య బలంగా ఉండటంతో, వారిని విడదీయడం సాధ్యం కాదని గ్రహించిన వైసీపీ.. ఇప్పుడు తన వ్యూహాన్ని క్షేత్రస్థాయికి మళ్లించింది. కూటమికి ప్రధాన బలంగా ఉన్న జనసేన ఓటు బ్యాంక్, ముఖ్యంగా కాపు సామాజికవర్గంలో గందరగోళం సృష్టించే బాధ్యతను వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు భుజాని కెత్తుకున్నారు. పవన్ కళ్యాణ్ తన సామాజిక వర్గాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారనే పాత విమర్శకు కొత్త పదును పెడుతూ, కాపు వర్గంలో విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోంది. జనసేన బలం తగ్గితే తప్ప తమకు భవిష్యత్తు లేదని భావిస్తున్న వైసీపీ, సామాజిక సమీకరణాల ద్వారా కూటమి పునాదులను కదిలించే పనిలో పడింది. వైసీపీకి త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఒక గొప్ప అవకాశంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు సర్దుకుపోయినట్లుగా, స్థానిక ఎన్నికల్లో గ్రామ స్థాయి క్యాడర్ సర్దుకుపోవడం దాపు అసాధ్యం. ప్రతి ఊరిలోనూ మూడు పార్టీలకు చెందిన ఆశావహులు ఉంటారు. సీట్ల కేటాయింపు దగ్గర మొదలయ్యే అసంతృప్తిని క్యాష్ చేసుకోవడమే వైసీపీ అసలు ప్లాన్. ఎక్కడైతే కూటమిలో విభేదాలు వస్తాయో, అక్కడ తటస్థులను లేదా అసంతృప్త నేతలను ప్రోత్సహించడం ద్వారా చిచ్చు పెట్టాలని వైసీపీ భావిస్తోంది. వైసీపీకి ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలిచామన్న దానికంటే, కూటమి పార్టీల మధ్య ఎంత దూరం పెంచామన్నదే ప్రధానం. "కూటమిలో ఏకాభిప్రాయం లేదు అనే ముద్ర వేయగలిగితే, అది వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి పెద్ద చీలికకు దారితీస్తుందని వారి నమ్మకం. క్యాడర్ స్థాయిలో గొడవలు మొదలైతే, అవి సహజంగానే పైస్థాయి నేతలపై ఒత్తిడి పెంచుతాయి. కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు, స్థానిక సీట్ల కోసం మూడు పార్టీల కార్యకర్తలు పోటీ పడుతుంటారు. అందరికీ అవకాశాలు కల్పించడం ఏ ప్రభుత్వానికైనా కష్టసాధ్యమైన పని. ఈ డిమాండ్ అండ్ సప్లై గ్యాప్‌ను వైసీపీ తన అనుకూలతగా మార్చుకోనుంది. కూటమి నేతల మధ్య ఈగో సమస్యలను రాజేయడం, ఒక పార్టీకి దక్కిన ప్రాధాన్యత మరో పార్టీకి దక్కలేదని ప్రచారం చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో కూటమి ఐక్యతను దెబ్బతీయడమే వైసీపీ ప్రస్తుత రాజకీయ ఎజెండా. వైసీపీకి ఇప్పుడు కావాల్సింది స్వంత బలం పెంచుకోవడం కంటే, శత్రువుల మధ్య బలహీనతను వెతకడమే. స్థానిక ఎన్నికల్లో గెలవడం ద్వారా వచ్చే ఫలితం కంటే, కూటమి పార్టీల మధ్య శాశ్వత పగ ను సృష్టించడమే వైసీపీ సాధించాలనుకుంటున్న అసలైన గెలుపు. చంద్రబాబు రాజకీయ చాణక్యం, పవన్ కళ్యాణ్ అంకితభావం ఈ వ్యూహాలను ఎలా తిప్పికొడతాయనేది వేచి చూడాలి.

# ఘనంగా శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరుడి గ్రామోత్సవం

## - కార్యనిర్వహణాధికారి కే.సుభాష్



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లెలోని శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానంలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉగాది పండుగ పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామాని ఆలయ ఈఓ సుభాష్, ఛైర్మన్ పీవీ. రమణ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారికి, ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి ఉగాది ఆస్థాన పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ పురోహితులు శంకర మంచి ప్రసాద్ నేతృత్వంలో శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం వేంపల్లె పురవీధుల్లో తాలమేళాల నడుమ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు అద్దంకి రామయ్య, సునీల్, సుబ్రమణ్యం, పెద్ద రెడ్డయ్య, రమణమ్మ, ఆలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# షిరిడి సాయిబాబా ఆలయంలో ఉగాది పండుగ ప్రత్యేక పూజలు



**పులివెందుల – సూర్య వాస్తవం :** పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని గురువారం శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమాన గణపతి పూజ కాగడ హారతి పంచామృత అభిషేకం తదితర పూజ కైకర్యాల అనంతరం షిరిడి సాయినాథుడు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. వాటిలో భాగంగా మధ్యాహ్నం హారతి సంధ్య హారతి శేజ హారతి తదితర కార్యక్రమాలు పండుగ వాతావరణంలో భక్తుల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య, ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ తీపి, చేదు కలిసినదే జీవితం. కష్టం సుఖం తెలిసినదే జీవితం, షడ్రుచుల సమ్మేళనమే ఈ ఉగాది పచ్చడి, ఈ ఉగాది నూతన సంవత్సరం మీ జీవితాల్లో చేదు కంటే తీపి ఎక్కువ ఉండాలని, ఉప్పొంగే ఉత్సాహాలను చిగురించే సంతోషాలను విరబూసే వసంతాలను షిరిడి సాయిబాబా అనుగ్రహంతో ప్రతి ఇంటిలో సకల శుభాలు చేకూరాలని కోరుకోవడం జరుగుతుందని తెలియజేస్తూ ప్రతి ఒక్కరికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

# రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి

## - ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధంతో రైతులు కుదేలవుతున్నారు - ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం :** ఇరాన్.. ఇజ్రాయిల్ యుద్ధంతో పండ్ల రైతులు పతనమవుతున్నారని పార్లమెంటులో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం కారణం వల్ల అరటి రైతులు, చిని రైతులు, మామిడి రైతులు, కలింగర రైతుల పండించిన పంట ఎగుమతులు లేకపోవడంతో ధర పూర్తిగా పతనమైందని దీంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆయన ప్రస్తావించారు. రైతులకు ప్రభుత్వాలు గిట్టు బాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. యుద్ధని అడ్డం పెట్టుకొని దళారులు కూడా రైతులను తక్కువ ధరలకు రైతుల పండించిన పంటను అడుగుతున్నారని ఆయన అన్నారు. కొంతమంది రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తోటలలో అలానే వదిలేస్తున్నారన్నారు. మరి కొంతమంది రైతుల పంటలు తోటలలో పండు బారిపోతున్నాయని ఆయన అన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం జరిగింది అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుంటే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రైతులను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు.

# ఉగాది నుంచైనా తెలుగు భాషను కాపాడుకుందాం

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం :** ఉగాది తెలుగువారి తొలి పండుగని, కనీసం ఉగాది పండుగ నాటి నుంచైనా తెలుగు భాషను, తెలుగుజాతిని కాపాడుకునేటందుకు తెలుగు తల్లి ముద్దుబిడ్డలందరూ అంకితం కావాలని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు తల్లి ముద్దుబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఉగాది పండుగ తెలుగు వారికి తొలి పండుగని,ప్రళయం అనంతరం బ్రహ్మదేవుడు ఉత్తరాయణ పుణ్యకాలంలో, వసంత రుతువు, చైత్రమాసం, శుక్లపక్షమి, పాడ్యమి నాడు సృష్టిని ప్రారంభించాడని నారద పురాణం చెబుతున్నదని అన్నారు. కనీసం ఉగాది నుంచైనా తెలుగు భాష, తెలుగు జాతి పరిరక్షణ కోసం తెలుగుతల్లి ముద్దుబిడ్డలందరూ అంకితం కావాలన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో తెలుగు భాష ఏడవ భాష. చైనీస్, స్పానిష్,ఇంగ్లీష్, హిందీ,బెంగాలీ మరాఠీ తర్వాత స్థానం తెలుగుది. ఐదు సంవత్సరాల క్రితం వరకు తెలుగు భాష ఐదవ స్థానంలో ఉండేది . ఈ ఐదు సంవత్సరాల్లో బెంగాలీ,మరాఠీ భాషలు తెలుగు భాషను అధిగమించాయి.దాదాపు 2500 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానం కలిగిన భాష తెలుగు భాష. ఇటాలియన్ అఫ్ ది ఈస్ట్ అని ఒక విధేయుడైన నికోలాస్ కాంటి తెలుగు భాషను ప్రస్తుతించాడు. సుందర తెలుంగు అని ప్రఖ్యాత తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి ప్రశంసించాడు. దేశభాషలందు తెలుగు లెస్స అని సాహితీ సమరాంగన సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు కొనియాడారు. ఒక విదేశీయుడైన సర్ సిపి బ్రౌన్ తెలుగు భాష నేర్చుకుని,తెలుగు నిఘంటువు రచించి, తెలుగు సూర్యుడిగా ప్రకాశించాడు.అటువంటి తెలుగు భాష ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే సమీప భవిష్యత్తులో మృతభాషగా మారుతుందేమోనన్న భయం కలుగుతోందని తులసి రెడ్డి అన్నారు. తెలుగు వద్దు -ఇంగ్లీష్ ముద్దు అమ్మ వద్దు -మమ్మీ వద్దు,నాన్న వద్దు - డాడీ ముద్దు అన్న సంస్కృతి రోజురోజుకు ఎక్కువవుతుంది.తెలుగులో మాట్లాడడం నామోషీగా, ఇంగ్లీషులో మాట్లాడడం గర్వకారణంగా భావిస్తున్నారు.

జగన్ ప్రభుత్వం పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ జీవో 85 జారీ చేయడం ఒక చారిత్రిక తప్పిదం. ఆ జీవోను తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొనసాగించడం మరో చారిత్రక తప్పిదం. ప్రపంచంలో ఏ దేశంలో గాని, దేశంలో ఏ రాష్ట్రంలో గాని మాతృభాషకు ఇటువంటి దుర్గతి పట్టలేదు. దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్లో తెలుగు భాషకు ఈ దుస్థితి పట్టడం దురదృష్టకరం. దీని కోసమేనా అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసింది? దీని కోసమేనా నంద మూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించింది?అని తులసిరెడ్డి ప్రశ్నించారు. తెలుగు భాష పట్ల,తెలుగుజాతి పట్ల తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలుగువారి తొలి పండుగ అయిన ఉగాదినాడే జీవో 85 ను రద్దు చేయాలని,పాఠశాల విద్యలో, కనీసం ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని అటు ప్రభుత్వ పాఠశాలలో ఇటు ప్రైవేట్ పాఠశాలలో తప్పనిసరి చేయాలని,తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉద్యోగాలలో, ఉన్నత విద్యా ప్రవేశాలలో రెండు శాతం అదనపు మార్కులు కలపాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, బద్రీనాథ్, రాఘవయ్య, వేమయ్య, శ్రీనివాసులు, ప్రసాద్, ఐచర్ రమణ నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో టీడీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం

## - ఉగాది వేడుకలో పాల్గొన్న బీటెక్ రవి దంపతులు
## - సంస్కృతి, సాంప్రదాయాలకు పవిత్ర పండుగ ఉగాది



**పులివెందుల – సూర్య వాస్తవం :** చైత్ర శుక్లపాడ్యమి యుగానికి ఆదిపర్వం, మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయా లకు ప్రతీకగా నిలిచే పవిత్ర పండుగ ఉగాది. తెలుగు ప్రజల నూతన సంవత్సర ఆరంభాన్ని సూచించే ఈ పర్వదినం, కొత్త ఆశలు, కొత్త ఆలోచనలు, కొత్త విజయాలకు నాంది పలుకుతుందని పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. గురువారం పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో పులివెందుల నియో జకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్, వారి ధర్మపత్ని, పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి వీరు ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన సంవత్సర వేడుకల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ప్రముఖ సిద్ధాంతి, బ్రహ్మశ్రీ పంచాంగం రామ్ కుమార్ శర్మ నూతన సంవత్సర ఫలితాలను వివరించారు. ఈ ఏడాది గ్రహగతుల మార్పులు, రాజకీయ, సామాజిక, వ్యవసాయ రంగాలపై వాటి ప్రభావాలను ఆయన క్షుణ్ణంగా విశ్లేషించారు. ద్వాదశ రాశుల వారికి ఉండబోయే ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమాన గణాంకాలతో పాటు రాష్ట్ర భవిష్యత్తు, వర్షపాతం వంటి కీలక అంశాలను కూటమి శ్రేణులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొనగా, వచ్చిన వారందరికీ సాంప్రదాయ బద్ధంగా ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం, సిద్ధాంతి బ్రహ్మశ్రీ పంచాంగం రామ్ కుమార్ శర్మ ని బీటెక్ రవి, లతా రెడ్డి దంపతులు, కూటమి నాయకులు ఘనంగా సత్కరించి, వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

# ప్రజా సేవే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యం




**పులివెందుల – సూర్య వాస్తవం :** ప్రజలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సంస్థ ముఖ్య ఉద్దేశమని మానవతా ఛైర్మన్ డివికొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉగాది పర్వదినం సందర్భంగా మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో న్యూ ఆపిల్ మెడికల్ స్టోర్ వారి సౌజన్యంతో గురువారం మానవతా కుటుంబ సభ్యులు ఎస్ గంగిరెడ్డి చేత చలివేంద్రము ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో మానవతా ఛైర్మన్ డివికొండారెడ్డి, ప్రెసిడెంట్ జి చంద్రశేఖర రెడ్డి, సెక్రటరీ ఎంవి శేషయ్య, ట్రెజరర్ బి.హరి చంద్రారెడ్డి, మానవతా కన్వీనర్ బివి కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఏవి.గోపాల్ రెడ్డి, సభ్యులు బండి శివరామిరెడ్డి, పి.రాజేశ్వరరెడ్డి, మాజీ ప్రెసిడెంట్ బి.జయరాజు, జయశేఖర్ రెడ్డి, న్యూ ఆపిల్ మెడికల్ స్టోర్ ప్రోప్రైటర్ గంగాధర పాల్గొన్నారు.



# రంజాన్ తోఫా పంపిణీ

**పులివెందుల – సూర్య వాస్తవం :** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నూరుల్లా ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపి రాష్ట్ర నూర్బాషా సంఘం అధ్యక్షుల ఓ రసూల్ హాజరై ఆయన చేతుల మీదగా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ దివంగత నేత వైయస్. రాజశేఖరరెడ్డి ముస్లిం పక్షపాతి అన్నారు. ఆయన ముస్లింల కోసం 4శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత, ఫీజు రిమెంబర్ మెంట్ లాంటివి ఎనో పదకాలు ప్రజలకు ఇవ్వడం జరిగిందన్నారు. తండ్రికి తగ్గ తనుయుడుగా 2019 లో జగన్మోహనరెడ్డి ప్రభుత్వం నవరత్నాల పేరు తో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేల చేసారు అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్ సేవలు మరవలేనివి నా చేతుల మీదగా పేద ముస్లిం కుటుంబలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయించడం ఎంతో సంతోషన్ని ఇస్తుందన్నారు.. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం...

- గత వైసిపి జగన్ ప్రభుత్వం మాయమాటలు తప్ప జాబ్ క్యాలెండర్ ఎక్కడ?
- నిరుద్యోగులను నాశనం చేసింది వైయస్ జగన్ కాదా?
- నిరుద్యోగులకు ఇది నిజమైన ఉగాది



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** నిరుద్యోగుల ఆశలను నిజం చేస్తూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురింపజేసిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఇది నిజమైన ఉగాదని స్పష్టం చేశారు. రాయదుర్గం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత జగన్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మాయమాటలతో వంచించిందని ఆరోపించారు. ఐదేళ్లు కాలయాపన చేస్తూ 13 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి, వారిని తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి చేసిందన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ప్రధాన స్థానాలన్నీ ఖాళీగా ఉండటంతో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు సహకారంతో 20 నెలల కాలంలో ఆరు లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రభుత్వ రంగంలోనే 30 వేల పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సుమారు పదివేల పోస్టుల భర్తీకి తాజాగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వం విశ్వసనీయతను చాటుకుందన్నారు. మంచి పాలనతో పెట్టుబడిదారులకు రాష్ట్రాన్ని స్వర్గధామంగా మార్చడంతో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. పరిశ్రమల ఏర్పాటు పూర్తి అయితే పారిశ్రామిక రంగంలోనే దాదాపు 25 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయన్నారు.

?తాజా జాబ్ క్యాలెండర్ ద్వారా గ్రూప్-1, గ్రూప్-2 తో పాటు పలు కీలక శాఖల్లో 10,060 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖలో ఉపాధ్యాయులతో పాటు జూనియర్ లెక్చరర్లు, ప్రొఫెసర్ల వంటి కీలక విభాగాల్లో శాశ్వత ఉద్యోగాలను భర్తీ చేయడం జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపడుతున్నామన్నారు. చంద్రబాబు నాయకత్వంలో నిరుద్యోగుల భవిష్యత్తుకు చక్కటి భరోసా లభిస్తుందని తెలిపారు. అనేకమంది ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. నియామకాల్లో చిన్న లోపం కూడా తలెత్తకుండా అత్యంత పారదర్శకంగా ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి నిరుద్యోగులు అండగా ఉండాలని, వారి తల్లిదండ్రులు నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాలవ విన్నవించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాలవ భరత్, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

# ఉగాది పంచాంగం శ్రవణం చేసిన మఠాధిపతులు



**బ్రహ్మంగారిమఠం- సూర్యవాస్తవం:** ప్రముఖ పుణ్యక్షేత్రంమైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠమునందు మఠాధిపతులు శ్రీ శ్రీ వెంకటాద్రి స్వాముల వారి ఆదేశాలను ప్రకారం 2026 శ్రీ పరాభావ నామ సంవత్సరం2027 గంటల పంచాంగమును మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాములవారు చేతుల మీదుగా ఆవిష్కరించి అనంతరం శ్రీ ప్రభావనామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని భక్తులకు పురప్రజలకు పటణం చేసి వినిపించి ఈ ఏడాది జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దివ్య ఆశీస్సులతో శ్రీ పరాభవ నామ సంవత్సరము భక్తులకు పురప్రజలకు సుఖసంతోషాలు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు సిద్ధించాలని ఆయన ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మఠం ఆస్థాన సిద్ధాంతాలు బ్రహ్మశ్రీ ఇడమ కంటి శివ జనార్ధనాచార్యులు దేవస్థాన మేనేజర్ ఈశ్వరయ్య చారి, పిపిఎన్ ప్రసాద్ మఠాధిపతి సోదరులు వీరభట్లమయ్య స్వాముల వారు దత్తాత్రేయ స్వాముల వారు, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి భక్తులు, పలువురు రాజకీయ నేతలు గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్ష వాయిదా వేయాలి

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అల్తాఫ్ బాబా వినతి

**అన్నమయ్య బ్యూరో - సూర్యవాస్తవం:** ముస్లింలకు అత్యంత ముఖ్యమైన, పవిత్రమైన పండగ రంజాన్ ఈ సంవత్సరం మార్చి 21 శనివారం జరుపుకోనున్నారు... కానీ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వం 20వ తారీఖున సెలవు ప్రకటించింది. పండగ రోజు పరీక్ష నిర్వహిస్తే ముస్లింలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. చంద్రమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం చంద్ర దర్శనం అవుతుంది శనివారం రంజాన్ పండగ జరుపుకుంటాము. కావున రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ముస్లింల తరఫున సూఫీ మత గురువు అల్తాఫ్ బాబా శనివారం సెలవుగా ప్రకటించి, పదవ తరగతి పరీక్షను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.

# పంట నష్టపోయిన రైతును ఆదుకుంటాం

- భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

**శింగనమల- సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం మండలం రోటరీ పురం గ్రామంలోని నారాయణస్వామి అనే రైతు పొలంలో ఈదురు గాలులకు కాకర పంట నేలకొరిగింది. మూడు లక్షల రూపాయల వరకు నష్టం జరిగినదని రైతు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ బుధవారం సాయంత్రం పంటను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపించి రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ హెచ్ ఓ అధికారి శైలజ, రైతు నారాయణస్వామి, శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, సోమశేఖర్ ,ఓబుల్ పతి, టిడిపి నేతలు పాల్గొన్నారు.



# మరియుఖాద్రి ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులకు అరుదైన గౌరవం

- ఘనంగా సన్మానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**శ్రీసత్యసాయిబ్యూరో - సూర్య వాస్తవం:** తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సరం పంచాంగ శ్రవణంలో భాగంగా శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఏవి నరసింహా వసంతచార్యులకు అరుదైన గౌరవం దక్కింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం విజయవాడలో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం మేరకు విజయవాడకు వెళ్లిన ఖాద్రి ఆలయ ప్రధాన అర్చకులు నరసింహచార్యులను సీఎం ఘనంగా సన్మానించారు. మరో అర్చకులు వాసుదేవా చార్యులను కూడా ముఖ్యమంత్రి ఘనంగా సత్కరించారు. శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను కూడా అత్యంత వైభవంగా నిర్వహించినందుకు ముఖ్యమంత్రి అర్చకులను అభినందించారు. ముఖ్యమంత్రి ప్రత్యేకించి ఖాద్రి ఆలయ అర్చకులను సన్మానించడం పట్ల ఆలయ అధికారులు సిబ్బంది పట్టణ ప్రజలు బంధువులు అభినందనలు తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చేత అభినందనలు పొందిన అర్చకులు కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నిరుపేద కుటుంబాలకు సరుకులు పంపిణీ







**డోన్ - సూర్య వాస్తవం:** స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ పట్టణంలో గల నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్ఫూర్తి సభ్యులు దాతల సహకారంతో రంజాన్ సరుకులను అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు స్ఫూర్తి మధు మాట్లాడుతూ మానవత్వమే అసలైన పండుగని, ప్రతి ఏటా రంజాన్ మాసంలో ?స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో స్ఫూర్తి దాతల అమూల్యమైన సహకారంతో నిరుపేద ముస్లిం సోదర సోదరీమణులకు "స్ఫూర్తి రంజాన్ కానుక" కిట్లను విజయవంతంగా పంపిణీ చేస్తున్నామని, పవిత్రమైన రంజాన్ మాసంలో పేదరికంలో ఉన్నవారి ముఖాల్లో చిరునవ్వు చూడాలనే స్ఫూర్తి సంకల్పానికి తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. రంజాన్ కానుకలను అందు కున్న వారు స్ఫూర్తి సభ్యులకు, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి మధు, శేగు హరినాథ్, లో శ్రీరాములు, సతీష్, శివయ్య, మహమ్మద్ వసంత్, కృష్ణారెడ్డి, సీసంగుంతల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ ముత్యాలమ్మ గుడి నిర్మాణంకు దాతల చేయూత

**శింగనమల- సూర్యవాస్తవం:**

సింగనమల మండలం తరిమెల గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవస్థానం ఉగాది పండుగ రోజున విశేష పూజలు జరిగినవి భక్తాదులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి గుడికి వచ్చి కానుకలు టెంకాయలు సమర్పించుకున్నారు గుడి నిర్మాణంలో జరుగుతున్న సందర్భంలో వడియం పేట గ్రామ వాస్తవ్యులు బొక్షం రవి. 10,000 రూపాయలు నగదు గుడి నిర్మాణానికై ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పండుగ రోజు అమ్మవారికి గుడి నిర్మాణంలో నా వంతుగా పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది అని తెలియజేశారు. గుడి నిర్మాణానికి రూ.30 లక్షలు అంచనా వేయగా ఇంతవరకు 18 లక్షల వరకు వసూలు కావడం సంతోషంగా ఉందని గ్రామ పెద్దలు పూజారి తెలియజేసినారు. గుడికి వచ్చే భక్తాదులు పెద్ద మొత్తంలో విరాళాలు ఇవ్వడం జరుగుతున్నది అని పూజారి రంగరాజు తెలిపారు ఇంకా విరాళాలు ఇచ్చే దాతలు ముందుకు వస్తే గుడి నిర్మాణము ఇంకా తొందరగా పూర్తి చేయవచ్చునని పూజారి తెలిపారు.





# ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమంటున్న రైతులు






**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామంలో ఉద్యాన పంటలు ఉద్యోగాలను సృ ష్టించడం,వివిధ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు ముడి పదార్థాలను సరఫరా చేయడం, ఉత్పాదకత విదేశీ మారకపు ఆదాయాన్ని పెంచడం ద్వారా వ్యవసాయ లాభదాయక తను పెంచడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ లో ముఖ్యమైన పాత్ర పోషి స్తాయి.ఉద్యానవన పంటలు వ్యవ సాయ ఉత్పత్తులు ఆహార వైవిధ్యానికి దోహదం చేస్తాయి. వాటిలో కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, ఖనిజాలు, రుచి,సువాసన,ఆహార ఫైబర్స్ ఇతర పోషకాలు ఉంటాయి. పండ్లలో ఆరోగ్యానికి సహాయపడే రసాయ నాలు మందులు ఉంటాయి.పండ్ల తోట పెంపకం వాతావరణానికి కా వాల్సినవి ఉపయోగకరంగా ఉంటా యి.ఉద్యాన పంటలు క్షేత్ర పంటల కంటే యూనిట్ ప్రాం తానికి ఎక్కువ పోల్చదగిన దిగుబడిని కలిగి ఉం టాయి.ప్రస్తుతం కరువు నేల అనం తపురం జిల్లా హార్టికల్చర్ హబ్‌గా రూపాంతరం చెందింది.చీని,మామి డి,అరటి,సపోటా,జామతో పాటు బొప్పాయి, అంజూర్, దానిమ్మ, ఖర్బుజా, కళింగర పంటలు ప్రత్యామ్నా యంగా పండించడానికి అను వైన నేలలు.ప్రభుత్వం చిన్న కమతాలలో పండ్ల తోటల పెం పకానికి సరైన ప్రో త్సాహకం ఇ వ్వాలి.మార్కెట్ సౌక ర్యం,నిల్వ సౌకర్యం,డ్రిప్,బోర్,సబ్సి డీ,మొక్కలకు మల్చింగ్ షీట్ రాయి తీ ఇస్తే లాభాలు వస్తాయని వన్నెదొ డ్డి రైతులు గంగంపల్లి వెంకట శివారె డ్డి,అంబటి రామకృష్ణ, అబ్బేదొడ్డి అఖి లాఫార్మ్ నిర్వాహకురాలు అఖిల మిత్ర, సురేష్ తదితరులు తెలిపా రు.పూల సాగు రెండు విధాలుగా చే స్తారు, మొదటిది ఇతర పంటల మా దిరిగానే బహిరంగ పొలాల్లో పూల మొక్కలు నాటడం,రెండవది మొక్క లు లేదా పంటలకు కృత్రిమంగా సృ ష్టించే (పాలీహౌస్) రక్షిత సాగు వి ధానం.ఇది పంటకు రైతుకు ప్రయో జనం చేకూరుస్తుంది శీతాకాలం,వే సవి,వర్షాకాలంలో ఎప్పుడైనా బం తిపూల సాగు చేయవచ్చు,బంతి పూల సాగు ప్రధానంగా చలికాలం లో జరుగుతుంది. వర్షాకాలం, శీతాకాలం వేసవి అనే మూడు సీజన్లలో దీన్ని సాగు చేస్తారని కూ డా నిజం.పూల పెంపకం అనేది అ లంకార ఉద్యాన వన శాస్త్రంలోని ఒక విభాగం,ఇది పుష్పాలు మరి యు అలంకార మొక్కలను పెంచ డం,అమ్మడం మరియు అమర్చడం వంటి వాటితో వ్యవహరిస్తుంది.స మ శీతోష్ణ వాతావరణాల్లో మొక్కల పెంపకం వ్యవస్థల్లో పువ్వులు మరి యు కుండీలలో ఉంచే మొక్కలను ఎ క్కువగా పెంచుతారు కాబట్టి,కొ న్ని పువ్వులను నర్సరీలు లేదా పం ట పొలాలలో ఆరుబయట పండి స్తారు.పూల పెంపకం అంటే పడకల మొక్కల పెంపకం మరియు గ్రీన్‌హౌ స్‌ల లో పెంచడానికి లేదా ఇంటి లో పల మొక్కలుగా ఉపయో గించడా నికి కోతలను ఉత్పత్తి చేయడం రెం డూ ఉంటాయి. పూల సాగు ఎల్లపు డు లాభదాయకమే. ప్రస్తుతం,పం డుగలు మరియు పెళ్లిళ్లు పూల రై తులకు మంచి ఆదాయం లభిస్తుం ది.పూలలో కనకాంబరాలు ఒక ప్ర త్యేకమైన స్థానంఉంది. కనకాంబరా లు మార్కెట్లో మంచి ధర లభిస్తుండ డంతో ఇటీవల కాలంలో రైతులు వీ టిని సాగు చేసేందుకు ఆశక్తి చూపు తున్నారు. కనకాంబరాలు ఉష్ణమం డల వాతావరణానికి అనుకూ లంగా ఉంటాయి. అంతేకాకుండా వాతావరణంలో వచ్చే హెచ్చుత గ్గులను కూడా కనకాంబరాలు త ట్టుకొని నిలబడగలవు. కనకాంబరాలు సాగును తక్కువ విస్తీరణంలో కూడా చేపట్టవచ్చు,కాబట్టి చిన్న మ రియు సన్నకారు రైతులు కూడా కన కాంబరాలను సులభంగా సాగు చె య్యవచ్చు.వీటిని సాగు చేసే రైతు లు కూడా మార్కెట్లో మంచి ధర ల భించడంతో మంచి లాభాలు పొం దుతున్నారు.కనకాంబరాలు సాగు చేపట్టే రైతులు అన్ని యాజమాన్య పద్ద తులను పాటిస్తే దాదాపు మూ డేళ్లపాటు నికర ఆదాయం పొందేం దుకు అవకాశం ఉంటుంది. మొక్క లు సాగు చేపట్టే ముందు రైతులు నీటి ఎద్దడిని తట్టుకునే బహువార్షికారకాలను ఎంచుకోవాలి, అంతేకా కుండా అధిక ఉష్ణోగ్రతలను తట్టుకు నే రకాలను ఎంచుకోవాలి.మేలైన యాజ మాన్య పద్దతులను పాటిస్తే మొక్కలు నాటిన మూడు సంవత్స రాల్లోనే దిగుబడి రావడం ప్రారంభ మవుతుంది.పూత ప్రారంభమైన తరువాత సంవత్సరం పొడవునా పూలు పూస్తాయి,జూన్ నుండి జన వరి వరకు పూతకు అనుకూలంగా ఉంటుంది,ఈ సమయంలో దిగుబ డి కూడా ఎక్కువుగా ఉంటుంది.కన కాం బరం మొగ్గలు పువ్వులుగా వి చ్చుకోవడానికి రెండు రోజుల సమ యం పడుతుంది. ఉదయం మరి యు సాయంత్రం వేళలు పూలు కో సేందుకు అనుకూలంగా ఉంటాయి. ఈ విధంగా ఏడాదికి 1800 నుండి 2500 కిలోల వరకు దిగుబడి పొం దవచ్చు, ప్రస్తుతం మార్కెట్లో కన కాంబరాలకు ఒక కిలో ధర 700–1 000 రూపాయల వరకు పలుకు తోంది.

# నెమ్మదిగా సాగుతున్న పనులు
# రెండో విడత భూసమీకరణపై నీలినీడలు

**విజయవాడ – సూర్య వాస్తవం:**
ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణం ప్రస్తుతం కీలక దశలో ఉంది. 2024లో పనులు పునఃప్రారంభమైన తర్వాత దాదాపు రెండేళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పురోగతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమరావతిలో ఐకానిక్ భవనాలైన అసెంబ్లీ, హైకోర్టు మరియు సచివాలయ టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సాధారణ మౌలిక సదుపాయాల పనుల్లో జాప్యం కనిపిస్తోంది. ముఖ్యంగా ట్రంక్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ లైన్ల వంటి పనులు అంచనా వేసిన దానికంటే నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో అమరావతి పనులు అనుకున్న విధంగా పూర్తవుతాయా లేదా అన్న సందేహం ప్రారంభమయింది. ఇది రెండో విడత భూసమీకరణ మీద ప్రభావం చూపిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ప్రధాన కాంట్రాక్టు సంస్థలు నిర్దేశించుకున్న లక్ష్యంలో కేవలం 10 నుండి 20 శాతం వరకు మాత్రమే భౌతిక పురోగతిని సాధించాయి. భారీ వర్షాలు, సాంకేతిక కారణాలు ఈ మందగమనానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్ల అభివృద్ధి విషయంలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మొదటి విడతలో దాదాపు 33,000 ఎకరాలు ఇచ్చిన రైతులకు



ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన ప్లాట్లు అందలేదు. ప్లాట్ల వద్ద రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం వంటి కనీస వసతులు లేకపోవడంతో ఆ ప్లాట్లు అమ్మకానికి గానీ, గృహ నిర్మాణాలకు గానీ అనుకూలంగా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం దాదాపు 1,300 కోట్లు లేఅవుట్ల అభివృద్ధి కోసం కేటాయించినప్పటికీ, పనులు ఆశించిన వేగంతో జరగకపోవడం రైతుల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.రాజధానిని మరో 16,000 నుండి 20,000 ఎకరాల మేర విస్తరించాలని ప్రభుత్వం రెండో విడత భూసమీకరణను ప్రారంభించింది. అయితే, మొదటి విడతలో భూములిచ్చిన రైతులకు కలిగిన ప్రయోజనంపై స్పష్టత లేకపోవడంతో, కొత్తగా భూములిచ్చేందుకు రైతులు వెనుకాడుతున్నారు. వైకుంఠపురం, పెదమద్దూరు వంటి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నా, రైతుల నుంచి స్పందన తక్కువగా ఉంది. ముందు పాత పనులు పూర్తి చేయండి.. ఆ తర్వాతే కొత్త భూములు అడగండి అన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ కారణంగానే రెండో విడత భూసమీకరణ ప్రక్రియ మందగించిందన్న ప్రచారం జరుగుతోందిఅమరావతిలో క్వాంటం వ్యాలీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి భారీ ప్రాజెక్టుల ప్రకటనలు ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం పెట్టుబడిదారులను ఆలోచనలో పడేస్తోంది. రాజధాని ప్రాంతంలో స్థిరాస్తి ధరలు పెరిగినప్పటికీ, వాస్తవంగా నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో కొనుగోలుదారులు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు , ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండిరూ. 15,000 కోట్ల వరకు నిధులు సమీకరించినప్పటికీ, ఆ నిధులను వేగంగా ఖర్చు చేసి పనులు పూర్తి చేయకపోతే ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ప్రస్తుతం నిర్దేశించుకున్న 2027–28 లక్ష్యాలను చేరుకోవాలంటే కేవలం భవనాలపైనే కాకుండా, రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది నిర్మాణ సంస్థలపై పర్యవేక్షణ పెంచి, రెండో విడత భూసమీకరణకు వెళ్లే ముందే మొదటి విడత ఫలితాలను కళ్లముందు చూపాల్సిన అవసరం ఉంది. అప్పుడే రెండో విడతలో భూములుఇచ్చేందుకు రైతులు మరింత ఆసక్తి చూపే అవకాశం ఉంది.



## ఆర్టీసీబస్టాండా ...ఆటో స్టాండా
- రాయచోటి ఆర్టీసీ బస్టాండ్లోకి ఆటోలు
- పట్టించుకోని ఆర్టీసీ సిబ్బంది



**అన్నమయ్య బ్యూరో – సూర్యవాస్తవం:** అన్నమయ్య జిల్లా రాయచోటలోని బస్టాండ్‌లో ఆటోల హడావిడి రోజుకి ఎక్కువ అయిపోయినట్టు ఆర్టీసీ డ్రైవర్లతో పాటు మరికొందరు వాపోతున్నారు. బస్సులు బస్టాండ్ దగ్గర రాగానే ఆటోలు వాటిలోనికి రావడంతో భయానికి అంతరాయండ ఉండడమే కాకుండా ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయా అన్న సందిగ్ధంలో ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ సెక్యూరిటీ పలుమార్లు ఆటో వారికి విన్నవించిన పెనాల్టీలు వేస్తున్న ఆర్టీసీ బస్టాండ్ లోకి ఆటోలు చొరబడి రావడం శరామాములుగా మారిపోయింది. ఇప్పటికైనా ఆర్టీసీ సిబ్బంది పకడ్బందీగా తమ చర్యలు తీసుకొని ఆటోలను బస్టాండ్ లోనికి హాని ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

## భూమి పూజ మహోత్సవం
## పట్టణ అధ్యక్షుడు నామ వేమకుమార్



**వేంపల్లె – సూర్యవాస్తవం:** వేంపల్లె పట్టణంలోని స్థానిక హరిజనవాడలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి శ్రీకారం చుడుతూ నిర్వహించే భూమి పూజ మరియు శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం ఉదయం 9:30కు ముఖ్య అతిథిగా పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ మా రెడ్డి రవీంద్ర నాథ్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నరని పట్టణ అధ్యక్షుడు నామ వేముకుమార్ తెలియజేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో వేంపల్లి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నామని తెలిపారు.

## శిబ్యాల గ్రామంలో ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** రాష్ట్ర రవాణా క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి మరియు నియోజకవర్గ యువ నాయకుడు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి గార్ల జన్మదిన సందర్భంగా రాయచోటి మార్కెట్ యార్డ్ చైర్మన్ అనుమపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు డివి కొండారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



# 'హీరోయిన్‌లను కూడా హీరోలతో సమానంగా గౌరవించండి' : అనుష్క టీం



హైదరాబాద్ : " హీరోయిన్‌లను కూడా హీరోలతో సమానంగా గౌరవంగా చూడండి " అంటూ ... సినీనటి అనుష్క టీం కోరింది. గత కొన్ని రోజులుగా సినీనటి అనుష్క పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఏడాది ఆమె ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆమె టీం స్పందించి స్పష్టతనిచ్చింది. ఆ వార్తలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. " ఒకరి వ్యక్తిగత జీవితాన్ని రోజువారీ ముఖ్యాంశాలుగా మార్చే ముందు కనీసం అది అధికారికమా, కాదా.. అని కూడా చూడడం లేదు. ఊహించడం, అంచనా వేయడం, అనధికారిక సమాచారాన్ని పదేపదే ప్రచురించడం సరైన పద్ధతి కాదు.

అన్నిటికంటే నిరాశ కలిగించే విషయం ఏమిటంటే.. ఆమె వయసుపై అనవసరమైన శ్రద్ధ చూపడం. ప్రతి పోస్ట్‌లోనూ '44' అనే నంబర్‌ను ఏదో వివాదాస్పదమైన అంశంలా ఎందుకు హైలైట్ చేస్తున్నారు? వయసు అంత పెద్ద సమస్య అయితే.. హీరోల వయసు విషయంలో కూడా ఇదే ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు ? మహిళల విషయంలోనే ఈ కథనం ఎందుకు భిన్నంగా ఉంటుంది?" అని అనుష్క టీం ప్రశ్నించింది. "అనుష్క శెట్టి తన కెరీర్‌ను గౌరవం, ప్రతిభతో హుందాగా నిర్మించుకున్నారు.

ఆమె ఎప్పుడూ పీఆర్ స్టంట్స్‌పై ఆధారపడలేదు. తన వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవాలని కోరుకునే వ్యక్తిని ఇలా టార్గెట్ చేయడం అన్యాయం. ప్రతిఒక్కరూ తమ జీవితంలో జరిగే విషయాలను అందరికీ చెప్పాలని అనుకోరు.


ఆ నిర్ణయాన్ని గౌరవించాలి. వివాహం అనేది వ్యక్తిగత విషయం. ఇది బ్రేకింగ్ న్యూస్ కాదు, ట్రెండ్ కాదు, కేవలం వ్యూస్ కోసం సెన్సేషనలైజ్ చేయాల్సిన విషయం అంతకంటే కాదు. ఇకనైనా బాధ్యతగా వ్యవహరించండి. హద్దులను గౌరవించండి. ప్రచురించే ముందు నిజాన్ని నిర్ధారించుకోండి. ముఖ్యంగా హీరోయిన్‌లను కూడా హీరోలతో సమానంగా గౌరవంగా చూడండి" అని టీమ్ పేర్కొంది.

## 'ది ప్యారడైజ్' శికంజా మాలిక్




నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి అప్‌డేట్ వచ్చింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఉగాది రోజు మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం శుభాకాంక్షలు తెలిపింది. సినిమాలో ఆయన నటిస్తున్న 'శికంజా మాలిక్' లుక్‌ను విడుదల చేస్తూ ఒక స్పెషల్ వీడియోను కూడా పంచుకుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21, 2026న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో కూడా విడుదల కానుంది.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' చాలా మంచి సినిమా : శ్రీలీల



'తెలుగు సినీ ప్రేక్షకులందరికీ ఉగాది శుభాకాంక్షలు. తెలుగు నూతన సంవత్సరాది కానుకగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదలవుతుండటం మాకు చాలా చాలా ప్రత్యేకం. సినిమా పట్ల మేము చాలా నమ్మకంగా ఉన్నాం. ఒక మంచి తెలుగు సినిమాగా నిలిచిపోతుందనే నమ్మకం నాకుంది. థియేటర్లలో ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ప్రేక్షకులు మా సినిమాని ఆదరించా లని కోరుకుంటున్నాం. రాశి ఖన్నా స్వీట్ హార్ట్. మా ఇద్దరి మధ్య సన్నివేశాలు లేనప్పటికీ, ఈ సినిమా చిత్రీకరణ సమయంలో ఒకరికొకరం దగ్గరయ్యాం. ఈ సినిమా మాకు చాలా ముఖ్యమైనది. అందరూ చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా' అని కథానాయిక శ్రీలీల అన్నారు.

'గబ్బర్‌సింగ్' వంటి విజయవంత మైన సినిమా తర్వాత పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా తెరకెక్కింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా కాగా, ఎస్.తమన్ నేపథ్య సంగీతం అందిం చారు. గురువారం ఈ సినిమా విడుదల కానుంది. బుధవారం చిత్ర బృందం, ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను నిర్వహించింది. హరీష్ శంకర్, నిర్మాత నవీన్ యెర్నేని, కథానాయిక రాశీఖన్నా మాట్లాడారు.





# 'గోల్స్'లో మెస్సీ చరిత్ర

### - 900 గోల్స్ మైలురాయిని చేరిన ఆటగాడు

మయామి: అర్జెంటీనా సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ తన కెరీర్‌లో 900 గోల్స్ అనే మ్యాజిక్ నంబర్‌ను చేరుకున్నారు. కోన్ కాకాఫ్ ఛాంపియన్స్ కప్ ప్రీ-క్వార్టర్ ఫైనల్స్‌లో నాష్‌విల్లేతో జరిగిన మ్యాచ్‌లో మెస్సీ ఈ ఘనతను సాధించారు. టెన్నెస్సీలోని జియోడ్స్ పార్క్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఏడవ నిమిషంలో మెస్సీ ఈ చారిత్రాత్మక గోల్ చేశారు. అయితే, మెస్సీ గోల్ చేసినప్పటికీ, ఇంటర్ మయామి ప్రీ-క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది.

38 ఏళ్ల ఈ అర్జెంటీనా ఆటగాడు 1,141 మ్యాచ్‌లలో రికార్డు స్థాయిలో గోల్స్ చేశారు. ఎనిమిది సార్లు బ్యాలన్ డి'ఓర్ విజేత అయిన మెస్సీ, జూన్ 2023లో ఇంటర్ మయామిలో చేరినప్పటి నుండి జట్టు కోసం 80 గోల్స్ చేశారు. అతను బార్సిలోనా తరపున 672 గోల్స్, పిఎస్జీ తరపున 32 గోల్స్ చేశారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అర్జెంటీనా తరపున కూడా అతను 115 గోల్స్ చేశారు.

గోల్స్ చేసిన వారి జాబితాలో మెస్సీ రెండవ స్థానంలో ఉన్నారు. 900 గోల్స్ పూర్తి చేసిన మొదటి ఆటగాడి రికార్డు పోర్చుగీస్ సూపర్ స్టార్ క్రిస్టియానో ??రొనాల్డో పేరు మీద ఉంది. రొనాల్డో 2024 సెప్టెంబర్‌లో క్రొయేషియాతో జరిగిన మ్యాచ్‌లో తన కెరీర్‌లో 900వ గోల్‌ను పూర్తి చేశాడు.

రొనాల్డో తన 1,236వ మ్యాచ్‌లో ఈ ఘనతను సాధించాడు. రొనాల్డో తన కెరీర్‌లో 1,000 గోల్స్ మైలురాయికి చేరువవుతున్నాడు. నలభై ఒక్క ఏళ్ల ఈ ఆటగాడు మొత్తం 965 గోల్స్ చేశాడు. రొనాల్డో పోర్చుగల్ తరఫున 141 గోల్స్ చేశాడు. ఈ ఆటగాడు స్పానిష్ క్లబ్ రియల్ మాడ్రిడ్‌లో 450 గోల్స్, మాంచెస్టర్ యునైటెడ్‌లో 145, జువెంటస్‌లో 101, అల్ నసర్‌లో 123 గోల్స్ మరియు తన తొలి క్లబ్ అయిన స్పోర్టింగ్ లిస్బన్‌లో ఐదు గోల్స్ సాధించాడు.

## కోల్‌కతా కూల్‌గా..

### -మూడుసార్లు ఛాంపియన్ నైట్‌రైడర్స్
### - రహానేకు మళ్లీ పగ్గాలు
### - 28నుంచి ఐపిఎల్ సీజన్-19



కోల్‌కతా: కూల్‌గా కనిపించే కోల్‌కతా నైట్‌రైడర్స్(కెకెఆర్) ప్రతి సీజన్‌లోనూ అత్యద్భుత విజయాలతో సత్తా చాటుతోంది. బాలీవుడ్ హీరో షారుక్‌ఖాన్ యజమాన్యంలో జుహీచావ్లా, జే మెహతా పర్యవేక్షణలో ఆ ఫ్రాంచైజీ అంచనాలకు మించి రాణిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో స్టార్ ప్లేయర్లు ఈ జట్టుకు అండగా ఉన్నారు. వారు ఏ దశలోనైనా మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల సమర్థులు. వారే మ్యాచ్‌లను గెలిపిస్తారు.. అద్భుతాలను సృష్టిస్తారు.. కెకెఆర్ జట్టులో దిగ్గజ ఆటగాళ్లు ఉన్నప్పటికీ ఒక్క పర్పుల్ క్యాప్‌ను గెలుచుకోలేదు. ఒకసారి మాత్రమే ఆరెంజ్ (అత్యధిక వికెట్లు తీసిన బౌలర్) క్యాప్ సాధించారు. 2024లో కెకెఆర్‌కు ముచ్చటగా మూడోసారి ట్రోఫీని అందించిన శ్రేయస్ అయ్యర్‌కే సాధ్యమైంది. ఆ తర్వాత శ్రేయస్‌ను వదులుకోవడం ఆ ఫ్రాంచైజీ చేసిన ఘోర తప్పిదం. దీంతో 2025లో ఆ జట్టు ఆటపై పెను ప్రభావం చూపింది. దీంతో ఆ జట్టు గత సీజన్‌లో 8వ స్థానానికే పరిమితమై పలు విమర్శలను ఎదుర్కొంది.


**మళ్లీ రహానేకే ఎందుకు..?**

ఐపిఎల్ 2026 సీజన్ కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ కెప్టెన్‌గా అజింక్యా రహానేను అధికారికంగా ప్రకటించింది. రింకూ సింగ్ పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, మేనేజ్‌మెంట్ రహానే వైపే మొగ్గు చూపింది. దీంతో జట్టు కెప్టెన్సీపై ఉన్న ఉత్కంఠను కెకెఆర్ తెర దించింది. యూపి టి20 లీగ్‌లో మీరట్ మావెరిక్స్‌ను, రంజీ ట్రోఫీ 2024-25లో ఉత్తరప్రదేశ్ జట్టును విజయపథాన నడిపిన అనుభవం రింకూకు ఉంది. అలాగే కెకెఆర్‌తో సుదీర్ఘ అనుబంధం కూడా రింకూ సింగ్‌కు ఉంది. అయినప్పటికీ మేనేజ్‌మెంట్ మాత్రం అనుభవజ్ఞుడైన రహానే వైపే మొగ్గు చూపింది. వేలానికి ముందే కెప్టెన్ ఎవరనేది తేల్చకుండా చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంపైనా పలు విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. 2025 సీజన్‌లో రహానే నాయకత్వంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. దీంతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంతో సరిపెట్టుకుని ప్లేఆఫ్స్‌కు చేరడంలో విఫలమైంది. అయినప్పటికీ, బ్యాటర్‌గా రహానే జట్టు తరపున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. దీంతో అనుభవజ్ఞుడైన రహానే సారథ్యంలోనే జట్టు విజయపథాన నడుస్తుందని జట్టు మేనేజ్‌మెంట్ భావించింది.

# శ్రీ పరాభవ నామ సంవత్సరంలో
# ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

- ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు
- ఘనంగా ఉగాది పండుగ వేడుకలు
- పంచాంగ పఠనం చేసిన శ్రీ బాలాజీ స్వామి
- జిల్లాకు చెందిన ఐదుగురు పంచ కవులను సన్మానించిన ఇంచార్జ్ జేసీ, మదనపల్లి శాసనసభ్యులు
- మొట్టమొదటిసారి జిల్లా కేంద్రంగా ఉగాది వేడుకలు నిర్వహణ
- ఎమ్మెల్యే షాజహాన్ భాష



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా ప్రజలందరూ పరాభవ నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు ఆకాంక్షించారు. గురువారం ఉదయం మదనపల్లి పట్టణం లోని పిపిఆర్ కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్యాటక శాఖల, రెవెన్యూ శాఖ, ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు . కార్యక్రమంలో ముందుగా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష గారిని ఉగాది పండుగ వేడుకలకు సోమేశ్వర స్వామి, యోగ భోగేశ్వర స్వామి తదితర ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మదనపల్లి శాసనసభ్యులు ముఖ్య అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఉగాది పండుగ వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ... శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిసి పల్లెసీమలు పశు సంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని అభిలాషించారు.

ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకమని, ప్రతి ఒక్కరి జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలను సమానంగా స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుందన్నారు.

మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా మాట్లాడుతూ ఉగాది పండుగ తెలుగు వారికి ఎంతో ప్రత్యేకమని తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆనందంగా ఆరోగ్యంగా సురక్షితంగా జీవించాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ ఉగాది పండుగను అన్నమయ్య జిల్లా మదనపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిసారిగా ఈ వేడుకను జరుపుకోవడం ఆనందదాయకమని తెలిపారు.

పంచాంగ శ్రవణం చేసిన శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ అర్చకులు శ్రీ బాలాజీ స్వామి, మదనపల్లి పట్టణంలోని యోగ భోగేశ్వర స్వామి ఆలయ అర్చకులు విశ్వేశ్వర స్వామి, అమర్, ఫణి తదితరులు పంచాంగ శ్రవణం చేస్తూ.... బ్రహ్మ ఈ సృష్టిని ఆవిర్భవింపజేసిన రోజును ఉగాది అని అంటామని పేర్కొన్నారు. ఒక్క తెలుగు సంవత్సరాన్ని ఒకొక్క పేరుతో పిలుస్తామని తెలిపారు. ఈ రోజున ప్రారంభమయ్యే తెలుగు సంవత్సరాన్ని శ్రీ పరాభవ నామ సంవత్సరంగా జరుపు కుంటున్నామన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఫలితంగా సుభిక్షము, క్షేమం ఆరోగ్యం,సురుష్టి ,సస్య సమృద్ధి కలుగుతుందని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే రకరకాల పరిస్థితులను ఏ విధంగా ఎదుర్కోవాలో అంచనా వేసుకొని కష్టాలను ఎదుర్కొనే శక్తిని సంపాదించుకోవడమే పంచాంగ శ్రవణం యొక్క ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరంలో అందరికీ శుభ ఫలితాలు రానున్నాయన్నారు. భారతదేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చెందబో తోందన్నారు. అన్నమయ్య జిల్లా ఈ సంవత్సరం సస్యశ్యామలంగా ఉండబోతుందన్నారు. మన అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో అన్ని రంగాలలో ముందు ఉంటుందని పేర్కొన్నారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల లాగే (ఆరు రుచులు) ప్రతి ఒక్కరి జీవితంలో రకరకాల అనుభవాలు జరుగుతాయన్నారు. కష్ట సుఖాలను సమానంగా తీసుకొని జీవితంలో ముందుకెళ్లాలనేదే ఉగాది పచ్చడి తినడం వెనక ఉన్న పరమార్థం అన్నారు. అనంతరం రాశిఫలాల గురించి చదివి వినిపించారు.

**తెలుగు భాష ప్రత్యేకతను చాటి చెప్పిన పంచ కవుల సమ్మేళనం**

తెలుగు భాష గొప్పదనాన్ని, తెలుగు భాష ప్రత్యేకతను చాటిచెబుతూ తెలుగు పద్యాలతో కవి సమ్మేళనం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరంలో ప్రజలు, జిల్లా, రాష్ట్రం మరియు దేశం సుభిక్షంగా ఉండాలని కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు ఆకాంక్షిస్తూ డాక్టర్ వేంపల్లి అబ్దుల్ ఖాదర్ --వచన కవిత, జలకనూరి మురళధర్ రాజు - పద్య పాఠనం,శ్రీమతి హసీనా బేగం -వచన కవిత, శ్రీమతి ఎస్.స్రవంతి - వచన కవిత, శ్రీమతి గాయత్రీదేవి వచన కవిత తెలుగు పద్యాలను, కవితలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంచ కవుల సన్మానం చేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీ లావణ్య శ్రీ నాట్య గురు కులానికి చెందిన విశిష్ట సాయి, శ్రీ వేద సంగీత నిత్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సేవా భారతి లకు చెందిన బాలికలు తెలుగు భాష గొప్ప తనాన్ని తెలియజేసి తెలుగు సంస్కృతిని చాటి చెబుతూ చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులందరినీ అలరించాయి.

**జిల్లాలో నలుగురు పండితులకు ఉగాది పురస్కారాల ప్రదానం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది సనాతన ధర్మానికి విశేష సేవలు చేసిన అర్చకులకు అందించే ఉగాది పురస్కారాలలో భాగంగా ఈ సంవత్సరం ఉగాది రోజున... జిల్లాకు చెందిన నలుగురికి 10,116 రూపాయలతో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా.. చిన్న తిప్ప సముద్రం మండలానికి చెందిన కే. రామా చార్యులు, నిమ్మనపల్లె మండలము, ముష్టూరు గ్రామము నాకు చెందిన పి.కృష్ణమాచార్యులు, వీరబల్లి మండలము, వంగిమళ్ళ గ్రామంనకు చెందిన డి.శివ శంకరా చార్యులు, మదనపల్లె మండలం, పోతబోలు గ్రామానికి చెందిన పి.రెడ్డి స్వామిలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా.. ప్రభుత్వం నుండి ఒక్కొక్కరికి రూ.10,116 లు సంభావన ప్రశంసా పత్రం, శాలువా,కాటన్ పంచ కండువా మరియు పంచాంగ పుస్తకము, ఒక బుట్టలో పండ్లు పెట్టి, ప్రశంసా పత్రాలను ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా తదితరులతో కలసి అందజేశారు. సాంస్కృతిక కార్య క్రమాలలో పాల్గొన్న చిన్నారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష,ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదనరావు మరియు వారి కుటుంబ సభ్యులకు సన్మానించి ఉగాది పచ్చడి, సంప్రదాయ ప్రసాదాలను సభి కులందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో.. దేవా దాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, పర్యాటకశాఖ జిల్లా అధికారి నాగ భూషణం, జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డిఆర్డిఏ పిడి సత్యనారాయణ, హార్టికల్చర్ ఆఫీసర్ సుభాషిని, రెవెన్యూ సిబ్బంది, వివిధ ఆలయ కమిటీ ఛైర్మన్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆలయ ఈవోలు కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్‌లు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.









## పట్టణంలో విస్తృత ఫుట్ పెట్రోలింగ్

**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లె సిఐ నరసింహులు పర్యవేక్షణలో గురువారం పట్టణంలో విస్తృత ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఫోర్ రోడ్ జంక్షన్ వరకు పోలీసులు పాదయాత్ర ద్వారా గస్తీ నిర్వహించారు. ఫుట్ పెట్రోలింగ్ సందర్భంగా, గాంధీ రోడ్డులో అనధికారికంగా ఏర్పాటు చేసిన వ్యాపారాలు, ఇతర ఆక్రమణలను పోలీసులు తొలగించారు. సిఐ నరసింహులు మాట్లాడుతూ పట్టణంలో రోడ్ల భద్రత, ట్రాఫిక్ సౌకర్యం, పాదచారుల సౌకర్యం కోసం ఈ చర్యలు చేపట్టాము అని తెలుపుతూ, ప్రజలు రోడ్ల ఆక్రమణలు నివారించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని చెప్పారు. పట్టణంలో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా కొనసాగనున్నాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు నేలకు ఒరిగిన అరటిపంట

**- పరిశీలించిన మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి**



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** సింహాద్రిపురం మండల వ్యాప్తంగా అర్ధరాత్రి కురిసిన భారీ వర్షాలకు అరటి చెట్లు గెలలతో సహా నేలకు ఓరిగాయి. ఈ విషయం తెలుసుకున్న మండల అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి , మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి లు గురువారం తోటల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడి జరిగిన పంట నష్టాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తోటలోనే కాయలు అలానే ఉన్నాయని ఆయన అన్నారు. కాయలు అమ్మడబోక రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో అకాల వర్షాలు వచ్చి పంటలను నేలకొరిగెలా చేశాయన్నారు. దీంతో రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. ఉన్నతాధికారులు పంటల నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాల్లో ఉత్తమ సేవలకు అవార్డు

**- అగ్నిమాపక సిబ్బంది సన్మానం**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** ఉగాది పురస్కారాల్లో భాగంగా ఉద్యోగ రీత్యా ఉత్తమ సేవలు అందించినందుకు స్థానిక అగ్నిమాపక కేంద్ర అధికారి బి.శివరామిరెడ్డికి ఉత్తమ సేవా పథకం అవార్డు దక్కింది. దీంతో గురువారం ఉగాది పండుగను పురస్కరించుకుని అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఉత్తమ సేవలపై ప్రభుత్వం గుర్తించి తమ అధికారికీ అవార్డు దక్కడం సంతోషకరమన్నారు. భవిష్యత్ లో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సురేంద్రనాథ్ రెడ్డి, చిన్ను, సంజీవ్ రెడ్డి, వీరాంజనేయులు, సలార్, హరిబాబు, సుబ్బయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది పర్వదినాన గ్రామస్తులు అక్కమ్మ అవ్వ చెట్టుకు ప్రత్యేక పూజలు



**ఉరవకొండ – సూర్యవాస్తవం:** వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా అక్కమ్మ అవ్వ చెట్టు వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గత ఏడాది భారీ వర్షాల కారణంగా అమ్మవారి వృక్షం నేలకొరిగి పోవడంతో, ప్రజలు పూజలు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా స్థానిక నాయకులు ఈ సమస్యని పరిష్కరించాలని, భక్తులకి అసౌకర్యం కలగకుండా చెట్టు చుట్టూ కట్టనిర్మించాలని స్థానికులు భక్తులు కోరుకుంటున్నారు.

## భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** సింహాద్రిపురంలో గురువారం ఉగాది పండగను భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ పద్ధతులలో నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా నూతన దుస్తులు ధరించి కుటుంబ సమేతంగా వారి స్వగృహాల యందు విశేష పూజలు అనంతరం ఆలయాల సందర్శన వారిలో భాగంగానే మధ్యాహ్నం గ్రామదేవతలు పెద్దమ్మ, అంకాలమ్మ తదితర అమ్మవారి ఆలయాలలో అమ్మవారికి చీరెలు బోనం బువ్వ సమర్పించి భక్తిని చాటుకోగా ఉగాదిని పురస్కరించుకొని ఆలయాలవద్ద మహిళలు అమ్మవారికి మొక్కులు బారులు తీయగా సింహాద్రి పురం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి తదితర ఆలయాలలో పంచాంగశ్రవణం నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగించారు.



## నేదురుమల్లి నివాసంలో ఉగాది సంబరాలు

**వెంకటగిరి– సూర్య వాస్తవం :** ఉగాది సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నియోజకవర్గ నాయకులతో కలిసి ఆనందంగా పంచుకున్నారు. మన తెలుగు ప్రజలకు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది పర్వదినం అన్నారు. ఈ సందర్భంగా గురువారం వెంకటగిరి లోని నేదురుమల్లి నివాసంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఉగాది పచ్చడి పంచుతూ నాయకులకు పేరుపేరునా శుభాకాంక్షలు తెలిపారు.





ఈ కార్యక్రమంలో వెంకటగిరి పట్టణ, రూరల్, డక్కిలి బాలాయపల్లి, రాపూరు, సైదాపురం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )